

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 24-04-2026 | సంపుటి - 27 | సంచిక -331 | రూ : 4 | పేజీలు: 8





## నిపుణులతో చర్చించాకే
# కాళేశ్వరంపై ముందుకు

2లో

- వెంటనే సీబీఐ విచారణ కోరాలని నిర్ణయం
- పెన్షనర్లు, ఉద్యోగుల బకాయిలపై 100 రోజుల్లో ప్రణాళిక
- 50 శాతం జీతం విరాళంగా ఇచ్చేందుకు ముందుకొచ్చిన మంత్రులు, ప్రజాప్రతినిధులు
- రూ.700 కోట్ల సీఎస్ఆర్ నిధులతో గచ్చిబౌలి స్టేడియం ఆధునీకరణ
- నామినేటెడ్ పద్ధతిలో పీఏసీఎస్ చైర్మన్ల నియామకం :క్యాబినెట్ నిర్ణయాలను వెల్లడించిన మంత్రులు పొంగులేటి, ఉత్తమ్, వాకిటి

# అమలుకు అనర్హం

- తొందరపాటు నిర్ణయాలొద్దు
- ఆర్టీసీ కార్మికులకు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి
- నేడు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో చర్చలకు ఆదేశం
- చర్చించుకుందాం... పరిష్కరించుకుందాం
- ఆర్టీసీ కార్మికులకు మంత్రుల విజ్ఞప్తి

2లో






## ఇరాన్ నౌకలను
# కాల్చిపారేయండి

- హార్ముజ్‌పై ట్రంప్ కీలక ఆదేశాలు
- నిర్బంధించినంత వరకూ తెరిచేది లేదు : ఇరాన్
- యుద్ధంతో పతనం దిశగా ఆర్థికవ్యవస్థ : ఎస్‌పీ గ్లోబల్ పర్చేజింగ్ సంస్థ వెల్లడి


2లో

# పోలింగ్ ప్రశాంతం

- తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో రికార్డు స్థాయిలో ఓటింగ్
- బెంగాల్‌లో ఘర్షణలు.. పోలింగ్ కేంద్రాల వద్ద ఉద్రిక్తం
- ఓటేసిన సినీతారలు, ప్రముఖులు

న్యూఢిల్లీ: తమిళనాడు, పశ్చిమబెంగాల్ (తొలివిడత) అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఈ రెండు రాష్ట్రాల్లోనూ రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. గతంతో పోల్చితే పశ్చిమబెంగాల్‌లో 91.35 శాతం నమోదైనట్టు ఎన్నికల సంఘం వెల్లడించింది. తమిళనాడులో 82.24శాతం పోలింగ్ తరువాయి 2లో





# కుబేర భారతం

- ఐదేండ్లలో 313 బిలియనీర్లకు చేరొచ్చు
- ప్రస్తుతం 207 మంది సంపన్నులు
- నైట్‌ఫ్రాంక్ రిపోర్ట్ విడుదల

2లో




## గురుకుల కళాశాలల్లో..
# ఎంపీసీ, బైపీసీకి డిమాండ్

- వీటివైపే విద్యార్థుల మొగ్గు
- ఇంటర్ ఫస్టియర్‌లో అందుబాటులో 69,430 సీట్లు

హైదరాబాద్: రాష్ట్రంలోని సంక్షేమ గురుకుల కళాశాలల్లో సీట్లను నూరు శాతం భర్తీ చేసేందుకు సొసైటీలు కార్యాచరణ సిద్ధం చేశాయి. ఇప్పటికే ప్రవేశ ప్రకటనలు జారీ అయ్యాయి. రాష్ట్రంలో 818 గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ఫస్టియర్‌లో మొత్తం 69,430 సీట్లు అందుబాటులో ఉన్నాయి. తరువాయి 2లో

## బెంగాల్ జోరు..
# మోదీ హుషారు!

- బెంగాల్‌లో నేడు 152 స్థానాల్లో తొలి దశ పోలింగ్
- రికార్డు స్థాయిలో పోటెత్తిన ఓటర్లు
- మే 4వ తేదీ బెంగాల్ లో మార్పునకు నాంది అంటూ మోదీ హర్షం
- టీఎంసీకి వ్యతిరేకంగా మహిళలు, యువత పోరాటం ప్రారంభించారని వ్యాఖ్యలు

2లో






# ఇక పెట్రో మంట ఉండదు
## కేంద్రం కీలక ప్రకటన

- ఎన్నికల తర్వాత పెట్రోల్, డీజిల్ ధరల పెంపు లేదన్న కేంద్రం
- ధరల పెంపు వార్తలు అవాస్తవం, దురుద్దేశ పూర్వకమని వెల్లడి
- గడిచిన నాలుగేళ్లుగా ధరలు పెంచని ఏకైక దేశం భారతేనని స్పష్టీకరణ
- అంతర్జాతీయంగా చమురు ధరలు పెరుగుతున్నా భారత్‌లో స్థిరంగానే రేట్లు

2లో

# నిపుణులతో చర్చించాకే కాళేశ్వరంపై ముందుకు

హైదరాబాద్ : న్యాయ నిపుణులతో చర్చించాకే కాళేశ్వరంపై హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ముందుకెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆర్టీసీ కార్మికుల సమస్యలు, కాళేశ్వరంపై హైకోర్టు తీర్పు తదితర అంశాలపై చర్చించేందుకు రాష్ట్ర మంత్రి వర్గం గురువారం హైదరాబాద్‌లోని బీఆర్.అంబేద్కర్ సచివాలయంలో సమావేశమైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశం ముగిసిన అనంతరం క్యాబినెట్ నిర్ణయాలను మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. హైకోర్టు పూర్తి తీర్పు పరిశీలించిన తర్వాత ఢిల్లీలో ఉన్న న్యాయ నిపుణులతో సంప్రదించి, సుప్రీంకోర్టుకు వెళ్లాలా.. లేదా కమిషన్ గడువు పొడగించాలా అనేది, వారిచ్చే సలహాలు సూచనల ఆధారంగా నిర్ణయం తీసుకోవాలని మంత్రివర్గంలో నిర్ణయించామని తెలిపారు. ప్రాజెక్ట్‌లో జరిగిన అవకతవకలు, లోపాలు, అక్రమాలపై సీబీఐ దర్యాప్తునకు ప్రభుత్వం జీవో జారీ చేసి తొమ్మిది నెలలైనా దర్యాప్తు ఇంకా ప్రారంభం కాలేదన్నారు. హైకోర్టు తీర్పు సీబీఐ దర్యాప్తునకు ఎలాంటి అడ్డంకిగా లేదని న్యాయ నిపుణులు తెలియజేశారన్నారు. వెంటనే సీబీఐ దర్యాప్తు చేపట్టాలని ప్రభుత్వం తరపున మరోసారి సీబీఐని కోరాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని చెప్పారు. కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ జ్యుడీషియల్ కమిషన్ నియామకంతో పాటు నివేదికను హైకోర్టు తప్పుబట్టలేదని తెలిపారు. జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చట్టబద్ధమనీ, రాజ్యాంగబద్ధమని కూడా అభిప్రాయపడిందన్నారు. పిటిషనర్లకు నోటీసులు ఇవ్వలేదనే సాంకేతిక కారణాలను హైకోర్టు తప్పుబట్టిందని తెలిపారు. ఈ నివేదికలో వారిపై ప్రస్తావించిన అంశాలు అమల్లో ఉండవనీ, వాటి ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని మాత్రమే తీర్పునిచ్చిందని పేర్కొన్నారు. కోర్టు తీర్పు ఇలా ఉంటే బీఆర్ఎస్ శ్రేణులు ఎందుకు సంబురాలు చేసుకుంటున్నారో చెప్పాలన్నారు. వారి చేసిన తప్పిదం వల్ల కాళేశ్వరం పేరిట ఏటా రూ.15 వేల నుంచి రూ.20 వేల కోట్ల అదనపు భారం పడుతోందన్నారు. కేంద్ర మంత్రి ఎన్డీఎస్ రిపోర్ట్ చదువుకుని మాట్లాడాలని హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారిక ఆహ్వానం మేరకు ఎన్డీఎస్ చైర్మెన్ అనిల్ జైన్ కాళేశ్వరం క్షేత్ర స్థాయి పరిశీలనకు వచ్చారనే విషయం సంజరు గుర్తుంచుకోవాలని తెలిపారు. అలాగే రెగ్యులర్ ఉద్యోగులకు సంబంధించి రూ.6,200 కోట్లు, రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సినవి రూ.8 వేల కోట్లు పెండింగ్ లో ఉన్నాయన్నారు. ఈ బకాయిలు గత సర్కార్ హయాం నుంచి కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా వీటిని వెంటనే ఇవ్వలేని పరిస్థితి ఉన్నప్పటికీ వెంటనే ప్రత్యామ్నాయ మార్గాలన్నీ అన్వేషించి, అవసరమైన నిధులు సర్దుబాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని చెప్పారు. మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులకు ఇచ్చే జీతాల నుంచి 50 శాతం రిటైర్డ్ ఉద్యోగులకు వెంటనే సర్దుబాటు చేయాలని ముందుకొచ్చారని వివరించారు. రిసోర్స్ మొబిలైజేషన్ సబ్ కమిటీ వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయ, రిటైర్డ్ ఉద్యోగుల సంఘాలు, బాధ్యులైన వారందరినీ పిలిచి చర్చలు జరిపి, వీలైనంత తొందరగా ఈ సమస్యను పరిష్కరించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుందన్నారు.

# పోలింగ్ ప్రశాంతం

న్యూఢిల్లీ: తమిళనాడు, పశ్చిమ బెంగాల్ (తొలివిడత) అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఈ రెండు రాష్ట్రాల్లోనూ రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. గతంతో పోల్చితే పశ్చిమబెంగాల్‌లో 91.35 శాతం నమోదైనట్టు ఎన్నికల సంఘం వెల్లడించింది. తమిళనాడులో 82.24శాతం పోలింగ్ నమోదైంది. చెన్నైలో 84.29 శాతం పోలింగ్ నమోదు కాగా బెంగాల్‌లోని దక్షిణ్ దినాజ్‌పూర్‌లో అత్యధికంగా 93.12శాతం పోలింగ్ నమోదైనట్టు వెల్లడించారు. సాయంత్రం 6గంటలతో పోలింగ్ సమయం ముగియగా.. అప్పటికే క్యూలైన్లలో ఉన్న వారికి ఓటు వేసేందుకు అనుమతించారు. తమిళనాడులో 234 స్థానాలకు, పశ్చిమ బెంగాల్‌లో తొలివిడతలో భాగంగా 152 స్థానాలకు పోలింగ్ ప్రక్రియ నిర్వహించారు. ఉదయం 7గంటలకే పోలింగ్ ప్రారంభమైనప్పటికీ ఓటర్లు ఎండను సైతం లెక్క చేయకుండా భారీ సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తొలి గంటల్లోనే పలువురు ప్రముఖులు పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ తన కుటుంబసభ్యులతో వచ్చి ఓటు వేశారు. సినీతారలు, ప్రముఖ రాజకీయ నాయకులు రజనీకాంత్, కమల్‌హాసన్, టీవీకే అధినేత విజరు తదితరులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.

* **పశ్చిమబెంగాల్‌లో అక్కడక్కడ ఉద్రిక్తతలు**

పశ్చిమ బెంగాల్‌లోని పలు జిల్లాల్లో ఉద్రిక్తత, అశాంతి నెలకొన్నట్టు వార్తలు వచ్చాయి. ముర్షిదాబాద్‌లో టీఎంసీ కార్యకర్తలకు, ఏయూజేపీ వ్యవస్థాపకుడు హుమాయున్ కబీర్‌కు మధ్య ఘర్షణ జరిగింది. సిలిగురిలో టీఎంసీ, బీజేపీ కార్య కర్తల మధ్య వేర్వేరు ఘర్షణలు జరిగినట్టు సమాచారం. కుమార్ గంజ్‌లో తన పోలింగ్ ఏజెంట్లను పలు బూత్‌ల నుంచి తొలగించారని బీజేపీ అభ్యర్థి సువేందు సర్కార్ ఆరోపించారు. తనపై దాడి జరిగిందనీ ఆయన పేర్కొన్నారు.

# కుబేర భారతం

న్యూఢిల్లీ : దేశంలో అధిక ధరలతో సామాన్యుల ఆదాయాలు హరించుకుపోతుంటే.. మరోవైపు అపర కోటీశ్వరులు భారీగా పెరుగుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, వడ్డీరేట్ల పెంపు భయాలు, ఆర్థిక అసమానతలు ఉన్నప్పటికీ ప్రపంచవ్యాప్తంగా సంపన్నులు అమాంత పెరుగుతున్నారని అంతర్జాతీయ ప్రాపర్టీ కన్సల్టెంట్ నైట్ ఫ్రాంక్ తాజాగా ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. ఈ రిపోర్ట్ ప్రకారం.. దేశంలోని బిలియనీర్ల సంఖ్య రాబోయే ఐదేండ్లలో 51 శాతం పెరిగి 313కు చేరుకోనుంది. 2026 ప్రారంభంలో 207గా ఉన్న ఈ సంఖ్య.. 2031 నాటికి భారీగా పెరగనుంది. ఈ వృద్ధి రేటు ప్రపంచ ఆర్థిక శక్తులైన చైనా (20 శాతం), అమెరికా (12 శాతం) కంటే ఎంతో ఎక్కువగా ఉండటం గమనార్హం. కేవలం బిలియనీర్లే కాకుండా సుమారు రూ.250 కోట్ల కంటే ఎక్కువ ఆస్తి ఉన్న అల్ట్రా రిచ్ వ్యక్తుల సంఖ్య కూడా మన దేశంలో 25,217కు చేరుకుంటుందని ఈ నివేదిక అంచనా వేస్తోంది. ప్రస్తుతం ప్రపంచ బిలియనీర్లలో భారత్ వాటా 6.7 శాతంగా ఉండగా.. 2031 నాటికి ఇది 8 శాతానికి పెరుగుతుందని అంచనా. ఇప్పటికే 914 మంది బిలియనీర్లతో అమెరికా, 485 మందితో చైనా మొదటి రెండు స్థానాల్లో ఉండగా, 207 మందితో భారత్ ప్రపంచంలోనే మూడవ స్థానంలో నిలిచింది. గడిచిన ఐదేండ్లలో సగటున ప్రతి రోజూ 89 మంది అల్ట్రారిచ్ జాబితాలో చేరారు. సాధారణంగా 30 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.250కోట్లు) కంటే ఎక్కువ నికర సంపద కలిగిన వారిని అల్ట్రా రిచ్‌గా పిలుస్తారు. 2021లో ప్రపంచవ్యాప్తంగా ఈ అల్ట్రా రిచ్ వ్యక్తుల సంఖ్య 5.51లక్షలుగా ఉండగా.. ప్రస్తుతం 7,13,626కు పెరిగింది. కాగా.. భారత్‌లో ప్రస్తుతం 19,877 అల్ట్రా రిచ్ వ్యక్తులు ఉండగా.. వచ్చే ఐదేండ్లలో ఈ సంఖ్య 25,217కు చేరనుంది. ఈ జాబితాలో భారత్ ప్రపంచవ్యాప్తంగా ఆరో స్థానంలో ఉంది. ధనవంతులు తమ సంపదను కేంద్రీకరించడానికి రియల్ ఎస్టేట్‌ను ప్రధాన మార్గంగా ఎంచుకుంటున్నారు. ప్రతి అత్యంత ధనవంతుడు సగటున 3.7 నివాసాలను కలిగి ఉన్నాడు. వారి మొత్తం సంపదలో 21 శాతం వాటా కమర్షియల్ రియల్ ఎస్టేట్‌లోనే ఉంది. దేశంలో ఒకవైపు బిలియనీర్ల సంఖ్య పెరుగుతుంటే.. మరోవైపు సామాన్యుడి ఆదాయాలు ద్రవ్యోల్బణం దెబ్బకు కరిగిపోతున్నాయి. నివాస స్థలాల ధరలు పెరగడం వల్ల ప్రధాన నగరాల్లో సాధారణ ప్రజల కొనుగోలు శక్తి తగ్గుతోంది. దేశ వృద్ధి రేటు గణాంకాల్లో కనిపిస్తున్నప్పటికీ దాని ఫలాలు అట్టడుగు వర్గాలకు అందడం లేదని ఆర్థిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సంపద కేవలం కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమవ్వడం వల్ల సమాజంలో ఆర్థిక అంతరాలు మరింత పెరుగుతున్నాయని అనేక రిపోర్టులు వెల్లడిస్తున్నాయి.

# ఇరాన్ నౌకలను కాల్చిపారేయండి

వాషింగ్టన్ : అమెరికా, ఇరన్‌ల మధ్య కాల్పుల విరమణ అమల్లోనే ఉన్నా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కీలక ఆదేశాలు జారీ చేశారు. హార్ముజ్ జలసంధిలో ఇరాన్ నౌకలు మందుపాతరలు (సిమైన్స్) అమర్చుతున్నాయని, వాటిని గుర్తించి దాడి చేయాలని అమెరికా నౌకాదళాన్ని ఆయన ఆదేశించారు. ఈ మేరకు సోషల్ ట్రూత్‌లో పోస్ట్‌చేశారు. 'హార్ముజ్ జలసంధిలో మైన్లను పెడుతున్న ఏ చిన్న పడవైనా సరే కాల్చి ధ్వంసం చేయాలని నావికా దళాన్ని ఆదేశించాను. ఈ విషయంలో ఏమాత్రం సంకోచించొద్దని చెప్పా. అమెరికా మైన్ స్వీపర్లు ప్రస్తుతం జలసంధిని క్లియర్ చేస్తున్నాయి. ఈ కార్యాచరణను మూడు రెట్లు అధిక వేగంతో కొనసాగించాలని ఆదేశిస్తున్నాను" అని పేర్కొన్నారు. అంతేకాకుండా హార్మూజ్ జలసంధి తమ ఆధీనంలోనే ఉందని ప్రకటించారు. నౌకల రాకపోకలు అమెరికా నేవీ అనుమతితోనే జరుగుతాయని ట్రంప్ రాసుకొచ్చారు. ఇరాన్ ప్రస్తుతం తమ నాయకుడు ఎవరో తేల్చుకొనేందుకు తీవ్ర ఇబ్బంది పడుతోంద న్నారు. అమెరికా నేవీ అనుమతి లేకుండా నౌకల రాకపోకలు జరగవన్నారు. ఇరాన్ తమతో ఒప్పందానికి వచ్చేంతవరకు నిర్బంధం కొనసాగుతుందని తెలిపారు అయితే కొద్దిరోజుల క్రితం ఆయనే స్వయంగా కాల్పుల విరమణను పొడిగిస్తూ ప్రకటించిన సంగతి తెలిసిందే. కాని ట్రంప్ నుంచే దాడి చేయలంటూ ఆదేశాలు రావడం గమనార్హం. మరోవైపు అమెరికా నిర్బంధం కొనసాగుతున్నంత కాలం హార్మూజ్ జలసంధిని తెరిచే ప్రసక్తే లేదని ఇరాన్ స్పష్టం చేసింది. ఇప్పటికే ఈ యుద్ధంతో హార్ముజ్ జలసంధి ఉద్రిక్త ప్రాంతంగా మారిపోయింది. అలాగే ఇరాన్ సముద్రంలో అమర్చిన సిమైన్స్ తీయడం అంత సులభం కాదని, వాటిని తీసేందుకు కనీసం 6 నెలల సమయం పడుతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అయితే 35 కి.మీ వెడల్పు ఉండే హార్ముజ్ జలసంధి కోసం అగ్రరాజ్యం అల్లాడిపోవడం, అనేక దేశాల్లో చమురు ధరలుపై ప్రభావం పడటం ఈ జలసంధి ప్రాముఖ్యతను తెలుపుతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు..

* **హార్ముజ్‌లో మందుపాతరల తొలగింపునకు**

**ఆరు నెలలు : పెంటగాన్**

హార్ముజ్ జలసంధిలో ఇరాన్ సైన్యం అమర్చిన మందు పాతరలను పూర్తిగా తొలగించడానికి ఆరు నెలల సమయం పడుతుందని అమెరికా ప్రతినిధి సభకు పెంటగాన్ తెలిపింది. పెంటగాన్ అంచనాలపై రిపబ్లిక్, డెమొక్రాట్ సభ్యులు అసహనం వ్యక్తం చేశారని, ఒకవేళ శాంతి ఒప్పందం కుదిరినప్పటికీ ఈ జాప్యం కారణంగా గ్యాసోలైన్, చమురు ధరలు పెరుగుతాయని అభిప్రాయపడ్డారని కొందరు అధికారులు తెలిపారు. హార్మూజ్ జలసంధి లోపల, దాని చుట్టుపక్కల ఇరాన్ సైన్యం 20కి పైగా మందుపాతరలు అమర్చి ఉండవచ్చునని ప్రతినిధి సభ సభ్యులకు పెంటగాన్ తెలియజేసింది. వీటిలో కొన్నింటిని జీపీఎస్ టెక్నాలజీ సాయంతో మారుమూల ప్రాంతాలలో ఏర్పాటు చేశారు. వాటిని కనిపెట్టడం అమెరికా దళాలకు అంత సులభమైన పనేమీ కాదని ఓ సీనియర్ రక్షణ అధికారి చెప్పారు. కొన్ని మందుపాతరలను భౌతికంగా అమర్చడం జరిగింది. అమెరికా, ఇజ్రాయిల్ దళాలు తనపై దాడి ప్రారంభించడంతో ఇరాన్ మార్చి నెలలో హార్ముజ్‌లో మందుపాతరలను అమర్చడం మొదలు పెట్టింది.

# ఇక పెట్రో మంట ఉండదు: కేంద్రం కీలక ప్రకటన

ఢిల్లీ, ఏప్రిల్ 23: పశ్చిమ బెంగాల్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల తర్వాత దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయంటూ వస్తున్న మీడియా కథనాలపై కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ స్పందించింది. ఈ వార్తలను 'దురుద్దేశపూర్వకమైనవి, తప్పుదోవ పట్టించేవి'గా అభివర్ణిస్తూ కొట్టిపారేసింది. ధరల పెంపునకు సంబంధించి ప్రభుత్వ పరిశీలనలో ఎలాంటి ప్రతిపాదన లేదని 'ఎక్స్' వేదికగా స్పష్టం చేసింది. ప్రజలలో అనవసర భయాందోళనలు సృష్టించేందుకే ఇలాంటి వార్తలను ప్రచారం చేస్తున్నారని మంత్రిత్వ శాఖ పేర్కొంది. "గత నాలుగేళ్లుగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరగని ఏకైక దేశం భారత్. అంతర్జాతీయంగా ధరలు భారీగా పెరిగినప్పటికీ, ఆ ప్రభావం ప్రజలపై పడకుండా ప్రభుత్వం, ప్రభుత్వ రంగ చమురు సంస్థలు నిరంతరం చర్యలు తీసుకున్నాయి" అని వివరించింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరిగి, అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగినప్పటికీ భారత్‌లో ధరలు స్థిరంగానే ఉన్నాయని గుర్తుచేసింది.

* **దేశంలో సాధారణంగానే ఎల్పీజీ**

**సిలిండర్ల సరఫరా**

ఇదే సమయంలో దేశంలో వంటగ్యాస్ (ఎల్పీజీ) సరఫరా సాధారణంగా ఉందని, ఎక్కడా కొరత లేదని పెట్రోలియం శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ తెలిపారు. మరోవైపు అమెరికా ఇరాన్ శాంతి చర్చలు నిలిచిపోవడంతో హార్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 103 డాలర్లు దాటగా, డబ్ల్యూటీఐ క్రూడ్ ఆయిల్ ధర 94 డాలర్లకు పైగా ట్రేడ్ అవుతోంది.

# ప్రభుత్వం సానుకూలం

హైదరాబాద్: ఆర్టీసీ కార్మికులు ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రాణాలు తీసుకోవడం వల్ల సమస్యలు పరిష్కారం కావన్నారు. గురువారం జరిగిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో ఆర్టీసీ కార్మికుల సమ్మెపై చర్చ జరిగింది. కార్మికులు చేస్తున్న డిమాండ్లు, సమ్మె ప్రభావంపై సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ కార్మికుల సమస్యల్ని పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉందన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించి చర్చించాలని మంత్రుల్ని ఆదేశించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, దామోదర్ రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆర్టీసీ కార్మికులు నిబ్బరంగా ఉండాలని.. సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రులు స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో చర్చలకు కార్మిక సంఘాలను ఆహ్వానిస్తున్నామని మంత్రులు తెలిపారు. సమస్యల్ని పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుంటుందన్నారు. నర్సంపేట ఘటనపై మంత్రులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇంకా ఏమన్నారంటే..

**ఒక్క ఉద్యోగినీ తొలగించం**

''ఆర్టీసీలో 201423 వరకు ఎలాంటి పరిస్థితులున్నాయో అందరూ ఆలోచించాలి. 2023లో అధికారంలోకి వచ్చిన మా ప్రభుత్వం కార్మికుల పెండింగ్ సమస్యల్ని ఒక్కోటి పరిష్కరిస్తోంది. 2013 పీఆర్‌సీ బకాయిలిచ్చాం.. 32 డిమాండ్లలో కార్మిక సంఘాలకు గుర్తింపు..వేతన సవరణ..ప్రభుత్వ సర్వీసులో ఉద్యోగుల విలీనం..ఈ మూడు అంశాలే ప్రధానంగా ఉన్నాయి. క్యాబినెట్‌లో చర్చించాం. సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులం..అందరం విజ్ఞప్తి చేస్తున్నాం.. ఆర్టీసీ కార్మికులెవరూ క్షణికావేశంలో అనాలోచిత నిర్ణయాలు తీసుకోవద్దు. మీ కుటుంబాలకు అన్యాయం చేయవద్దు. నిరసనలను అణచివేయాలనే ఆలోచన ప్రభుత్వానికి లేదు. వాటికి అడ్డుపడం. అయితే ఆత్మహత్య ప్రయత్నాలు మంచిది కాదు. ఈ ప్రభుత్వానికి నెగెటివ్ ధోరణి లేదు. తెలంగాణ సాధనలో మీ పాత్ర కీలకం. ఇది మీ ప్రభుత్వం. నమ్మకంతో ఉండండి. కొత్త ఉద్యోగాలు, కొత్త బస్సుల కొనుగోలు, మౌలిక సదుపాయాల్ని పెంచడం, కారుణ్య నియామకాలు, తొలగించిన వారిని తీసుకోవడం ఇలా అన్నింటిపై సానుకూలంగా ఉన్నాం. ఎలక్ట్రిక్ బస్సులు వచ్చినా ఉద్యోగ భద్రతకు ఢోకా ఉండదు. ఒక్కరినీ తొలగించం. కానీ బయట నుంచి కొందరు మిమ్మల్ని ప్రోత్సహిస్తున్నారు. డిప్యూటీ సీఎం ఆధ్వర్యంలో శుక్రవారం మాట్లాడుకుందాం. రాష్ట్రానికి, ప్రభుత్వానికి మీరంతా కావాల్సినవారు.

# గురుకుల కళాశాలల్లో.. ఎంపీసీ, బైపీసీకి డిమాండ్

హైదరాబాద్: రాష్ట్రంలోని సంక్షేమ గురుకుల కళాశాలల్లో సీట్లను నూరు శాతం భర్తీ చేసేందుకు సొసైటీలు కార్యాచరణ సిద్ధం చేశాయి. ఇప్పటికే ప్రవేశ ప్రకటనలు జారీ అయ్యాయి. రాష్ట్రంలో 818 గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ఫస్టియర్‌లో మొత్తం 69,430 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఎస్సీ గురుకుల సొసైటీ మినహా బీసీ, ఎస్టీ, మైనారిటీ గురుకుల సొసైటీలన్నీ ప్రవేశపరీక్షలు లేకుండా విద్యార్థులు పదోతరగతిలో సాధించిన మార్కులు ఆధారంగా సీట్లు భర్తీ చేయాలని నిర్ణయించాయి. గతేడాది కూడా మార్కుల ప్రాతిపదికనే ప్రవేశాలు కల్పించడంతో సీట్ల భర్తీ దాదాపు 6% పెరిగింది. సంక్షేమ గురుకులాల్లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ సీట్లకు అత్యధిక డిమాండ్ ఉంటోంది. ఈ నేపథ్యంలో 202627 విద్యాసంవత్సరానికి కళాశాలల్లో కొన్ని గ్రూపుల్లో మార్పులు చేయాలని సొసైటీలు సమాలోచనలు చేస్తున్నాయి. ఎస్టీ గురుకుల సొసైటీ పరిధిలో కిందటేడాది ఇంటర్ రెండేళ్లు కలిపి దాదాపు 29% సీట్లు భర్తీ కాలేదు. ఆర్ట్స్ ఇతర గ్రూపుల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. 202627 ఏడాదికి పదోతరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా అడ్మిషన్లు కల్పించాలని సొసైటీ నిర్ణయించింది. ఎస్సీ గురుకుల సొసైటీ మౌలిక సదుపాయాలు ఇతర కారణాలతో గతేడాది 12 కళాశాలల్లో ప్రవేశాలు నిలిపివేసింది. దీంతో దాదాపు 2,500 సీట్లు తగ్గిపోయాయి. గత ఏడాది ఈ సొసైటీ పరిధిలో దాదాపు 23% సీట్లు ఖాళీగా ఉన్నాయి. సీట్ల భర్తీకి గత రెండేళ్లు మార్కుల ఆధారంగా ప్రవేశాలు చేపట్టగా... 202627 విద్యాసంవత్సరానికి ప్రత్యేక ప్రవేశపరీక్ష నిర్వహించేందుకు ప్రకటన జారీ చేసింది. బీసీ గురుకుల సొసైటీలో అత్యధికంగా 261 కళాశాలలు ఉన్నాయి. సొసైటీలో గత ఏడాది సీట్ల మిగులు దాదాపు 45% ఉంది. ఫలితాల్లో సొసైటీ అత్యుత్తమ పోటీ ఇస్తున్నా.. సీట్లు భర్తీ కావడం లేదు. గతేడాది నుంచి మార్కుల ప్రాతిపదికన సీట్లు భర్తీ చేయడంతో ప్రవేశాలు 3వేల వరకు పెరిగాయి. ఈ ఏడాదీ మార్కుల ప్రాతిపదికన ప్రవేశ ప్రకటన జారీ చేసింది. మైనారిటీ సొసైటీలో గత ఏడాది 47% సీట్లు భర్తీ కాలేదు. కొన్నేళ్లుగా సొసైటీలో ప్రవేశపరీక్ష లేకుండా నేరుగా ప్రవేశాలు కల్పిస్తున్నా, నూరుశాతం లక్ష్యం సాధ్యం కావడం లేదు.

# బెంగాల్ జోరు.. మోదీ హుషారు!

మధురాపూర్ (పశ్చిమ బెంగాల్), ఏప్రిల్ 23 : పశ్చిమ బెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా దండెత్తింది బీజేపీ కాదని... రాష్ట్రంలోని మహిళలు, యువతే చురుకైన పోరాటాన్ని ప్రారంభించారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. గురువారం 152 నియోజకవర్గాల్లో జరిగిన తొలిదశ అసెంబ్లీ ఎన్నికల్లో నమోదైన అధిక ఓటింగ్ శాతమే దీనికి నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. బెంగాల్ లో సాయంత్రం 5 గంటల సమయానికి 89.93 శాతం ఓటింగ్ నమోదైంది. రెండో దశ ఎన్నికలు ఏప్రిల్ 29న జరగనున్న నేపథ్యంలో, దక్షిణ 24 పరగణాల జిల్లాలోని మధురాపూర్‌లో నిర్వహించిన ప్రచార సభలో ప్రధాని మాట్లాడారు. తీవ్రమైన ఎండను కూడా లెక్కచేయకుండా ఓటర్లు పోటెత్తడం చూస్తుంటే, మే 4వ తేదీ కేవలం ఫలితాల రోజు మాత్రమే కాదని, పశ్చిమ బెంగాల్‌లో మార్పునకు నాంది పలికే రోజని రుజువు చేస్తోందని మోదీ పేర్కొన్నారు. "ఈరోజు ఓటర్లలో కనిపించిన ఉత్సాహం, ముఖ్యంగా మహిళలు, తొలిసారి ఓటు హక్కు వినియోగించుకుంటున్న యువతలో కనిపించిన ఆసక్తి, తృణమూల్ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నిజమైన పోరాటాన్ని ప్రారంభించింది వారేనని నిరూపించింది" అని ఆయన వివరించారు. ఇటీవల లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ చట్ట సవరణను అడ్డుకోవడంలో తృణమూల్ కాంగ్రెస్ పోషించిన పాత్రతో ఆ పార్టీ అసలు స్వరూపం రాష్ట్రంలోని మహిళలకు అర్థమైందని మోదీ అన్నారు. "లోక్‌సభలో జరిగిన పరిణామాలతో తృణమూల్, ఇతర ప్రతిపక్ష పార్టీల మహిళా వ్యతిరేక వైఖరి బయటపడింది. అందుకే ఈ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్‌కు గట్టి గుణపాఠం చెప్పాలని బెంగాల్ మహిళలు నిర్ణయించుకున్నారు. మహిళా సాధికారతకు అడ్డంకిగా నిలిచినందుకు ఈసారి తృణమూల్‌ను వారు కచ్చితంగా శిక్షిస్తారు. బెంగాల్ కాళీమాత, దుర్గామాత వెలసిన నేల. కానీ తృణమూల్ పాలనలో ఇక్కడ మహిళలకు భద్రత లేదు. కాబట్టి మీ ఓటు అన్నింటినీ మారుస్తుంది. ఇకపై అన్యాయాన్ని సహించవద్దు" అని ఆయన పిలుపునిచ్చారు. పశ్చిమ బెంగాల్‌లో 15 ఏళ్ల తృణమూల్ కాంగ్రెస్ పాలనకు మే 4వ తేదీ గడువు తేదీ అవుతుందని మోదీ జోస్యం చెప్పారు. అవినీతి, దోపిడీ, హింస, మహిళలపై నేరాలతో నిండిన చీకటి రోజులు ఆ రోజుతో ముగిసిపోతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# అంగన్వాడి కేంద్రాల ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం




భువనగిరి, ప్రజాస్ఫూర్తి : పోషణ్ పక్వాడా సందర్భంగా అంగన్వాడి కేంద్రాల ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం, గ్రాడ్యుయేషన్ డే, సీమంతం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను జాయింట్ డైరెక్టర్ అక్కేశ్వర్ రావు సందర్శించి, చిన్నారులు , గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న సేవల గురించి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు అనంతరం సిడిపిఓ లు, సూపర్వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి నరసింహారావు మున్సిపల్ కమిషనర్ తంగెళ్లపల్లి శ్రీవాణి, రవి కుమార్, వైస్ చైర్మెన్ పోతంశెట్టి మంజుల, సిడిపిఓ లు శైలజ, స్వరాజ్యం, సమీరా. ఐసిడిఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# టీజీ ఎస్ డబ్ల్యూ ఆర్ఎస్ జెసి గర్ల్స్ హాస్టల్ ను సందర్శించిన రెవెన్యూ అదనపు కలెక్టర్



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : ఆలేరు టీజీ ఎస్ డబ్ల్యూ ఆర్ఎస్ జెసి గర్ల్స్ హాస్టల్ ను గురువారం రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంక రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మొత్తం ఎంత మంది విద్యార్థులు ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను సెలవులకు పేరెంట్స్ వచ్చి ఇంటికి తీసుకొని వెళ్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు.హాస్టల్లో ఉన్న విద్యార్థులతో కలిసి అదనపు కలెక్టర్ భోజనం చేసి హాస్టల్ లో మెనూ ప్రకారం రుచి కరంగా ఆహారం అందిస్తున్నారా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి , స్నాక్స్ ఏం ఏం ఇస్తున్నారని అడిగి తెలుసుకున్నారు . విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు అదనపు కలెక్టర్ టీ షర్ట్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో సివిల్ సప్లైస్ అధికారి, హాస్టల్ స్పెషల్ అధికారి రోజారాణి, ప్రిన్సిపల్ వెంకటమ్మ,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పట్టుదలకు మారుపేరు భగీరథ మహర్షి

* **కలెక్టర్ బి చంద్రశేఖర్**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : పట్టుదలకు మారుపేరు భగీరథ మహర్షి అని జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ అన్నారు.గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో భగీరథ మహర్షి జయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.కఠోర దీక్ష, పట్టుదలతో గంగను దివి నుండి భువికి తీసుకువచ్చి ప్రపంచాన్ని సస్యశ్యామలం చేసిన మహనీయుడని అన్నారు. ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, భవితరాలకు ఆ స్ఫూర్తిని అందించాల్సిన అవసరం ఉందన్నారు.అర్హులకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో సగర సంఘం తరఫున సహకరిస్తామన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. గృహజ్యోతి, మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇల్లు, పెన్షన్, రేషన్ బియ్యం వంటి సంక్షేమ పథకాలు . సగర సంఘం లోఅర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చూస్తామన్నారు. అర్హులైన సగరులు పథకాల కోసం ప్రజావాణిలో దరఖాస్తులు చేసుకోవాలని, జిల్లా స్థాయిలో పరిశీలించి, అర్హులకు ప్రయోజనాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.అలాగే నిర్మాణరంగంలో పనిచేస్తున్న సగరులు, కార్మికులు లేబర్ కార్యాలయంలో నమోదు చేసుకుంటే అనుకోని సంఘటనల సమయంలో సహాయం అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.సగర సంఘం తరఫున అర్హుల జాబితా అందిస్తే వారికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సహకరిస్తామని పేర్కొన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, సమాచార శాఖ సహాయ సంచాలకులు.వెంకటేశ్వర్లు సగర,బీసీ వెల్ఫేర్ అధికారి సంజీవయ్య, సగర సంగం అధ్యక్షులు రవికుమార్ సగర, రాష్ట్ర ఉపాధ్యక్షులు కట్ల మారయ్య సగర, జిల్లా కార్యదర్శి కరుణాకర్ సగర, తదితరులు మాట్లాడారు.స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ టిడిపి రాజ్ కుమార్, కలెక్టర్ కార్యాలయ ఏఓ మోతీలాల్, బీసీ సంక్షేమ శాఖ సిబ్బంది, జిల్లా సాగర సంగం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు జిల్లా సగర సంగం ఆధ్వర్యంలో నల్గొండ పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

# హుస్నాబాద్ శ్రీ రేణుక ఎల్లమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ శ్రీ రేణుక ఎల్లమ్మ మహా జాతర పోస్టర్ ను మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి స్థానిక ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించినట్లు ఆలయ ఈవో పి. కిషన్ రావు తెలిపారు. ప్రతి సంవత్సరం హుస్నాబాద్ పట్టణంలో జరిగే ఈ మహా జాతర ఏర్పాట్లను ముమ్మరం చేస్తున్నట్లు వచ్చే నెల ఒకటవ తేదీ నుండి నెల రోజులపాటు హుస్నాబాద్ లో జాతర జరుగుతుందని ఈవో పేర్కొన్నారు.ఈ జాతరకు వివిధ జిల్లా నుండి రాష్ట్రాల నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారని అందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆయన అన్నారు.అదేవిధంగా మంత్రి ఆదేశాల మేరకు ఆలయ అభివృద్ధిలో భాగంగా దేవాలయ ప్రాంగణంలో 450 ట్రాక్టర్ల మొరాన్ని పోయించడం జరుగుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అధికారం లోకి రావడానికి ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

* **హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్**



హుస్నాబాద్ , ప్రజాస్ఫూర్తి : ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు మద్దతుగా మాజీ శాసన సభ్యులు హుస్నాబాద్ వొడితల సతీష్కుమార్ హాజరై కార్మికులకు సంఘీభావం తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఆర్టీసీ కార్మికులకు న్యాయం చేయాలని వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరసన తెలిపే హక్కు కూడా లేకుండా కార్మికులను అణచివేయడం, కూర్చోవడానికి వేసిన తార్పాలిన్లు తొలగించడం సరైంది కాదన్నారు.స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వం లోకి రాకముందు ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా మాట్లాడిన వీడియోను విలేకరుల ముందు ప్రదర్శిస్తూ, ఇప్పుడు అధికారంలో ఉన్నందున అదే హామీలను అమలు చేయాలని కోరారు. ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో ప్రైవేటీకరణకు అవకాశం కల్పించడం సరైంది కాదని విమర్శించారు. గత ప్రభుత్వం ప్రారంభించిన విలీన ప్రక్రియను పూర్తి చేయాలని, ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని అన్నారు. కార్మికుల సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు తాను వ్యక్తిగతంగా బీఆర్ఎస్ పార్టీ తరఫున పూర్తి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆర్టీసీ జేఏసీ నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

## కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం

# నరేగా చట్టాన్ని రద్దు చేయడం దుర్మార్గం

* **అఖిల భారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షులు అశోక్ దావలె**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నరేగా చట్టాన్ని రద్దు చేయడం దుర్మార్గమని ఆలిండియా కిసాన్ సభ అధ్యక్షులు అశోక్ దావలే అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని సామినేని రామారావు నగర్లో గురువారం ప్రారంభమైన తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర మూడో మహాసభ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు అధ్యక్షతన సభ నిర్వహించారు.ఈ సభలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ద్వారా తెలంగాణలో, ప్రభుత్వాల ద్వారా కేరళ, బెంగాల్, త్రిపుర రాష్ట్రాల్లో కమ్యూనిస్టులు పేదలకు లక్షలాది ఎకరాల భూములను పంచితే నేటి పాలకులు రైతుల నుంచి భూములను గుంజుకుంటున్నాయన్నారు. దాని స్థానంలో తీసుకొచ్చిన రామ్ బోగస్ అని విమర్శించారు. బీజేపీ విధానాలు దేశానికి ప్రమాదకరంగా మారాయన్నారు. దాన్ని ఎదుర్కొనేందుకు ఐక్య సంఘటనా పోరాటాలు చేయడం అత్యావశ్యకం అని నొక్కి చెప్పారు.. కొత్తగూడెంతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. సామినేని రామారావు, కాసాని ఐలయ్యకు ఘన నివాళి అర్పించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రయివేటీకరణ విధానాల వల్ల సింగరేణి సంస్థ మనుగడ ప్రశ్నార్థమైందన్నారు. బొగ్గుగనులకు వేలం వేసి అందులో సింగరేణి సంస్థనూ పాల్గొని దక్కించుకోవాలని పాలకులు చెప్పడం దుర్మార్గమన్నారు. సింగరేణి సంస్థకు బొగ్గు గనులు కేటాయించాలని కోరారు. 50 వేల కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సింగరేణి సంస్థకు చెల్లించాలని డిమాండ్ చేశారు.

* **హామీలు నెరవేర్చని మోడీ సర్కార్: ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి విజ్జూ కృష్ణన్**

11 ఏళ్ల పాలనలో ప్రజలకు మోడీ ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి విజ్జూ కృష్ణన్ విమర్శించారు. ప్రజల నుంచి బలవంతంగా భూములను గుంజుకుంటున్న తీరును ఎత్తిచూపారు. మూడు నల్లచట్టాలు, లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా ఎరజ్రెండా నేతృత్వంలో బలమైన పోరాటాలు రావాలని ఆకాంక్షించారు. రానున్న కాలంలో రైతాంగ పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభలో మాజీ ఎంపీ తమ్మినేని వీరభద్రం, సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం. సాయిబాబు, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి. వెంకట్, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్, సీనియర్ నేతలు సారంపల్లి మల్లారెడ్డి, అరిబండి ప్రసాద్, జంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే, జాతీయ నేత జూలకంటి రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, రైతు సంఘం మహిళా విభాగం కన్వీనర్ కందాల ప్రమీల, రైతు సంఘం భద్రాది కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు యలమంచి వంశీకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, ఉపాధ్యక్షులు బుర్రొర ప్రసాద్, మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు, న్యాయవాది శివరాంప్రసాద్, ఆదివాసీ, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు బండారు రవికుమార్, ప్రజా సంఘాల నేతలు శ్రీరాంనాయక్, ఆశయ్య, ఉడుత రవీందర్, అన్నవరపు కనకయ్య, ఏజే రమేశ్, మచ్చా వెంకటేశ్వర్లు, ఎమ్. జ్యోతి, బంతు రాంబాబు, కె.పుల్లయ్య, కె. ధర్మా, వెంకట్, కె. బ్రహ్మాచారి, బుర్రా శ్రీరాం, అన్నవరపు సత్యనారాయణ, పిట్టల రవి, కార్పొరేటర్ సీహెచ్.శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

* **తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక స్టేట్ జనరల్ సెక్రెటరీ బుర్ర శ్రీనివాస్ గౌడ్,**




హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా రవాణా స్తంభించిపోయి సామాన్య ప్రజలు ఎటు వెళ్లాలన్నా ప్రయాణించాలన్న తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి కనీసం పట్టింపు లేదని, ఆర్టీసీ కార్మికుల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక స్టేట్ జనరల్ సెక్రెటరీ, బుర్ర శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. గురువారం హుస్నాబాద్ ఆర్టీసీ డిపో ఎదుట సమ్మె చేస్తున్న కార్మికులకు సంఘీభావం మద్దతు ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో ఆర్టీసీ కార్మికుల పాత్ర చాలా కీలకమని బస్సులు ఆగితే ప్రజా రవాణా స్తంభించితేనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయిందని, అలాంటి ఆర్టీసీ కార్మికులను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ఆయన అన్నారు. కార్మికులు తమ న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచారని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఆర్టీసీని పూర్తిగా ప్రభుత్వంలో విలీనం చేసి ఆర్టీసీ సంఘాలను ఏర్పాటు చేస్తామనే న్యాయపరమైన హామీలు ఇవ్వడం జరిగిందని ఇప్పుడు ఆ హామీలను తుంగలో తొక్కి కార్మికుల పట్లమొండి వైఖరిని చూపించడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు..? ఆర్టీసీ కార్మికుల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని వెంటనే సమ్మెను విరమింప చేసే విధంగా ఆర్టీసీ జేఏసీ నాయకులను చర్చలకు పిలవాలని, ముఖ్యమంత్రి రవాణా మంత్రి చొరవ తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఆర్టీసీ కార్మికుల పట్ల ఏమాత్రం ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉన్న వెంటనే ప్రభుత్వంలో విలీనం చేసి పేస్కేల్ అమలు చేసి మిగతా డిమాండ్లను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకొని కార్మికులకు న్యాయం చేకూర్చాలని ఆయన అన్నారు. లేని పక్షంలో ఆర్టీసీ కార్మికుల పక్షాన సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గాదెపాక రవీందర్, ఆర్టీసీ జేఏసీ హుస్నాబాద్ చైర్మన్ సుధాకర్ రెడ్డి,నాయకులు రామ్మోహన్ రెడ్డి,మహిళా నాయకురాలు శైలజ జ్యోతి ఆర్టీసీ కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పట్టుదలతో చదివి పైకి రావాలి

* **పేద విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీలో ఏఎస్పి రమేష్**




నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : ప్రభుత్వము దాతలు స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వ పాఠశాలలకు కల్పిస్తున్న సదుపాయాలను అవకాశాలుగా మార్చుకొని కష్టపడి చది వి పైకి ఎదగాలని అడిషనల్ సూపరిండెంట్ రమేష్ అన్నారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన పేద విద్యార్థినులకు ఆయన సైకిలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ తల్లిదండ్రులు గురువులు పెద్దల మాటలు వింటే ఉన్నత స్థాయికి ఎదుగుతారు అన్నారు. విద్యార్థులు నిరంతరం అన్వేషణలో ఉండాలని అన్నారు. మనకున్న బలహీనతలపై పోరాడాలన్నారు. సెల్ ఫోన్లు చూసి టైం వేస్ట్ చేయకుండా ఆ టైమును సద్వినియోగం చేస్తే వృద్ధిల్లోకి వస్తారని సూచించారు. ఉదయం బ్రహ్మ ముహూర్తంలో అంటే ఐదు గంటలకు లేస్తే శరీరం మెటపాలిజం తో ఉత్తేజంగా ఉల్లాసంగా ఉంటుందని చెప్పారు. అలాగే రాత్రి ఆలస్యంగా పడుకుంటే మన జీవన విధానం అస్తవ్యస్తంగా ఉంటుందన్నారు. ప్రతిరోజు అరగంట సేపు వ్యాయామం చేయాలని, రోడ్డు భద్రత పాటించాలని,సిగ్నల్స్ అనుసరించాలని,మైనర్లు బైకులు నడపవద్దని, హెల్మెట్లు పెట్టుకోవాలని,ఎడమవైపు మాత్రమే నడవాలని పలు ట్రాఫిక్ రూల్స్ ను వివరించారు. సొసైటీ నుండే గుర్తింపు పొందిన వారు సొసైటీకి సేవ చేయాలని లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు సైకిల్ పంపిణీ చేసిన లైన్స్ క్లబ్ సభ్యులను అభినందించారు . సహాయం అవసరం ఉన్న వారికే సహాయం చేయాలని సూచించారు,ఎవరికి ఏ అవసరం ఉందో వారికే అవసరం తీర్చాలన్నారు. కార్యక్రమంలో డిస్టిక్ గవర్నర్ రేపాల మదన్మోహన్ డిస్టిక్ కో ఆర్డినేటర్ తీగల మోహన్రావు సతీష్ కుమార్ కోడే గోలి అమరేందర్ రెడ్డి కేవీ ప్రసాద్ వెంకటేశ్వరరావు అశోక్ రెడ్డి, వివిధ లైన్స్ క్లబ్ ల కార్యవర్గం సభ్యులు పాల్గొన్నారు


# రైస్ మిల్లర్లు బియ్యం డెలివరీ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి

* **స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**



భువనగిరి , ప్రజాస్ఫూర్తి : గురువారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఛాంబర్ లో,రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి తో కలిసి ఎఫ్సీఐ అఫీషియల్స్ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మరియు రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో..రైస్ మిల్లులలో సీఎంఆర్ బియ్యం డెలివరీ విషయంలో చిన్న చిన్న కారణాల వల్ల బియ్యం రిజెక్షన్ అవుతున్నాయని, దీనివలన మిల్లర్లు చాలా నష్టపోతున్నారని, బియ్యం పెట్టడానికి కూడా ముందుకు రావడం లేదనే దాని పై చర్చించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బియ్యం రిజెక్షన్ కావడానికి గల కారణాలు ఎఫ్సీఐ అధికారులతో చర్చించడం జరిగిందని, రైస్ మిల్లర్లు బియ్యం డెలివరీ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలుపగా, ఎఫ్సీఐ వారు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి రోజారాణి, ,జిల్లా మేనేజర్ పౌర సరఫరాలు హరికృష్ణ, ఎఫ్సీఐ అధికారులు , రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

# టియు వేదిక రాష్ట గౌరవాధ్యక్షులుగా నర్సయ్య



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం : తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా కొత్తగూడెంకు చెందిన శ్రావణ బోయిన నరసయ్య ఎన్నికయ్యారు. 1969 తెలంగాణ ఉద్యమ కాలంలో ప్రముఖ భూమికను పోషించి తెలంగాణ ఉద్యమకారుల్లో చైతన్యాన్ని, స్ఫూర్తిని నింపిన నర్సయ్య తొలి, మలి 1969 తెలంగాణ ఉద్యమ పోరాట సమితి స్థాపించి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో అలుపెరుగని పోరాటం చేశారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. ఉద్యమ కారులను తెలంగాణ స్వతంత్ర సమరయోధులుగా గుర్తించి స్వతంత్ర సైనిక్ సమన్ ఏ-1గ్రేడ్ కింద పెన్షన్ ఇవ్వాలని, గృహం, వైద్యం, రవాణా సౌకర్యంతోపాటు కుటుంబంలో ఒకరికి వయో పరిమితి లేకుండా ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని శ్రావణబోయిన నర్సయ్య డిమాండ్ చేశారు. టియు వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా ఎన్నికైన నర్సయ్యను పలువురు అభినందించారు.

# ఘనంగా భగీరథ మహర్షి జయంతి వేడుకలు



ప్రజాస్ఫూర్తి, వనపర్తి జిల్లా : సగర కుల దైవం, గంగను భూమికి తీసుకువచ్చిన మహానుభావుడు భగీరథ మహర్షి జయంతి వేడుకలను వనపర్తి జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల, గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. వనపర్తి జిల్లా సగర సంఘం అధ్యక్షులు మోడల తిరుపతయ్య సగర ఆధ్వర్యంలో గురువారం భగీరథ మహర్షి విగ్రహానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ, మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ..సమాజ హితం కోసం ఆనాడు భగీరథుడు అవిశ్రాంతంగా కృషి చేసి నేటి సమాజానికి కూడా ఆదర్శ ప్రాయుడయ్యారని కొనియాడారు. మహనీయులను స్మరించుకుంటూ వారి స్ఫూర్తితో నేటి యువతరం ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి, వైస్ చైర్మన్ మధు గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లోక్ నాథ్ రెడ్డి, కౌన్సిలర్లు, తదితర పార్టీల నాయకులు, సగర సంఘం పెద్దలు, అన్ని మండలాల అధ్యక్షులు, గ్రామ అధ్యక్షులు తదితరులు పాల్గొని భగీరథ మహర్షికి పూల మాలలు వేసి ఈ ఉత్సవాలను విజయవంతం చేశారు.

# ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని సీఎం ఇంటికి పాదయాత్ర




హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : పెండింగ్ స్కాలర్షిప్స్ , ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఇంటికి పాదయాత్ర అనే కార్యక్రమ గోడ పత్రికను, గురువారం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హిమాయత్ నగర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి కసిరెడ్డి మణికంఠ రెడ్డి,పుట్ట లక్ష్మణ్ లు పాల్గొని విడుదల చేశారు.

# ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం

*** డిఎస్పీ కే శివరాం రెడ్డి..**

నల్గొండ, ప్రజాస్ఫూర్తి : నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడతాయి అని,ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం అని నల్గొండ డిఎస్పీ కే శివరాం రెడ్డి అన్నారు. గురువారం నల్గొండ మండల పరిధిలోని కాజీరామారం గ్రామంలో గ్రామస్థుల సహకారంతో రూ.1.30 లక్షలతో 10 సీసీ కెమెరాలు తిప్పర్తి ఎస్సై వి శంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా ముఖ్య అతిథిగా నల్గొండ డిఎస్పీకే శివరాం రెడ్డి, హాజరై గ్రామ సర్పంచ్ సల్వాది సైదులు, గ్రామ కార్యదర్శి రాజేశ్వరి, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు, జీనెక్స్ సీడ్స్ కంపెనీ డైరెక్టర్ సుంకరి వెంకటేశ్వర్లు గౌడ్ ,ఉప సర్పంచ్ సుంకరి సుమలత మోహన్ రావు, వార్డు సభ్యులు, గ్రామ టిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు , ప్రజాప్రతినిధులతో కలిసి గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా డి.ఎస్.పి కే శివరామిరెడ్డి మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరని, ఇప్పటికే పలు గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేరం జరిగినపుడు దాన్ని వీలైనంత త్వరగా పరిష్కరించడానికి సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని, పెద్ద పెద్ద నేరాలను కూడా సీసీ కెమెరాల ద్వారా గుర్తించవచ్చని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన దాతలందరినీ ఈ సందర్భంగా అభినందించారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు.

*** హెల్మెట్ ధరించడం ప్రతి ఒక్కరి బాధ్యత: ఎస్.పి శివరాం రెడ్డి.**




సీసీ కెమెరాల ప్రారంభ సమావేశం అనంతరం డిఎస్పీ మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, హెల్మెట్ ధరించకుండా వాహనం నడిపితే ప్రమాదాలు జరిగి మరణించే అవకాశాలు ఎక్కువ ఉన్నాయని తెలిపారు. గ్రామంలో ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించే లాగా ఏర్పాటు చేయాలని గ్రామ సర్పంచ్ గ్రామ పెద్దలను డీఎస్పీ కోరగా నల్గొండ జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు, జీనెక్స్ సీడ్స్ కంపెనీ డైరెక్టర్ సుంకర వెంకటేశ్వర్లు గౌడ్ స్పందించి త్వరలోనే గ్రామ సర్పంచ్ గ్రామ ముఖ్య నాయకుల అందరితో కలిసి గ్రామంలో ప్రతి ఒక్కరికి హెల్మెట్ అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.అనంతరం పోలీసు అధికారులను గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు, జీనెక్స్ సీడ్స్ కంపెనీ డైరెక్టర్ సుంకరి వెంకటేశ్వర్లు గౌడ్ , గ్రామ సర్పంచ్ ప్రజా ప్రతినిధులతో కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ బి ఆర్ ఎస్ పార్టీ ముఖ్య నాయకులు సుంకరి శ్రీనివాస్, పాలకూరి యాదయ్య, దండంపల్లి సైదులు, పాలకూరి దశరథ, గ్రామ రేషన్ డీలర్ దండంపల్లి రవికుమార్ గౌడ్ ,దొనకొండ రవికుమార్, నకరికంటి సైదులు, బుల్లెదు రమేష్, వార్డు సభ్యులు గ్రామస్తులు , తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బ తగిలి మృతి చెందిన రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

*** బీఎస్పీ నియోజకవర్గ ఇన్చార్జ్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్**




హుస్నాబాద్ , ప్రజాస్ఫూర్తి.: గత నాలుగు రోజుల క్రితం హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కు ధాన్యం తీసుకొచ్చి ధాన్యం ఆరబోస్తున్న రైతు నెమలికొండ ఒదయ వడదెబ్బ తగిలి అస్వస్థకు గురై హాస్పిటల్ లో మృతి చెందడం జరిగింది.మృతి చెందిన రైతు కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని హుస్నాబాద్ నియోజకవర్గ బిఎస్పి ఇన్చార్జ్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఒదయ తీసుకొచ్చిన వడ్లు ఇంకా హుస్నాబాద్ మార్కెట్ యార్డు ఆవరణలోనే ఉన్నాయని నిబంధనల ప్రకారం వడ్లు తేమశాతం రావడానికి మూడు రోజులు ఎండలో ధాన్యం ఆరబోస్తూ తీవ్ర అస్వస్థకు గురై చనిపోవడం జరిగిందని జరిగిందని ఆయన అన్నారు. ఆయన భార్య కూడా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారని,మార్కెట్ ఆవరణలో చనిపోతే రైతుకు నిబంధన ప్రకారం ఐదు లక్షల ఇన్సూరెన్స్ ఇవ్వవలసి ఉంటుంది ఈ విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్, మార్కెట్ చైర్మన్ పాలకవర్గం యుద్ధ ప్రాతిపదికన ఆ రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని బిఎస్పి పార్టీ పక్షాన డిమాండ్ చేశారు ఇప్పటికీ హుస్నాబాద్ లో మార్కెట్ యార్డులో కాకుండా మిగతా రెండు సెంటర్లో ఒక్క శాతం వడ్లు కొనలేని పరిస్థితి ఏర్పడిందని ఒకవైపు అకాల వర్షాలు కురిసే అవకాశం కనబడుతున్న ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## అరుదైన 'నాగుపాము' పట్టివేత



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: పట్టణ పరిధిలోని పాత కొత్తగూడెం తెలంగాణ పాఠశాల వద్ద చెల్ల రాము అనే వ్యక్తి ఇంట్లోకి బుధవారం రాత్రి పెద్ద తాచుపాము రావడంతో వెంటనే ప్రాణధార ట్రస్ట్ స్నేక్ రెస్క్యూ స్పెషలిస్ట్ సంతోష్‌కు సమాచారమిచ్చారు. సంతోష్ ట్రస్ట్ సభ్యులు శ్రీకాంత్, తుమ్మ శ్రీకాంత్‌లతో వెళ్లి 5అడుగుల నాజా నాజా (ఇండియన్ స్పెక్టికల్ కోబ్రా) ను పట్టుకుని సురక్షితంగా బంధించారు. తెల్లవారేసరికి అది డబ్బాలో 18గుడ్లు పెట్టిందని సంతోష్ తెలిపారు. గర్భంతో ఉన్న పాము గుడ్లు పెట్టేందుకు స్థలం వెతుకుతూ రాము ఇంట్లోకి వెళ్ళిందని, ఒకవేళ పామును చూసి ఉండకపోతే ఇంట్లోని ఓ రహస్య ప్రాంతంలో ఆ పాము గుడ్లు పెట్టేది అని చెప్పారు. గురువారం స్పెక్టకిల్ కోబ్రా (నాజా నాజా) పాముతోపాటు దాని గుడ్లను అడవిలో సురక్షిత ప్రాంతంలో వదిలేశారు. తాచు పాములు 10 నుండి 50 వరకు గుడ్లు పెడతాయని, కాలాన్ని బట్టి 50 నుండి 70 రోజుల్లో పిల్లలు వస్తాయని, అప్పటి వరకు తల్లి పాము కాపలా కాస్తూ ఆహారం కూడా తినకుండా ఉంటుందని సంతోష్ చెప్పారు. వేసవి కాలంలో పాములు చల్లదనం కోసం ఇంట్లోకి వస్తాయని, రాత్రుళ్ళు వెలుతురు ఉండాలని, కింద నేలపై పడుకోవడం క్షేమం కాదని జాగ్రత్తగా ఉండాలని వివరించారు.

## ఆయిల్ పామ్ తోటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

*** జిల్లా ఆయిల్ ఫెడ్ అధికారి భాస్కర్ రెడ్డి**



సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం, ప్రజాస్ఫూర్తి: సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం ఖానాపూర్ గ్రామంలో గురువారం ఆయిల్ పామ్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్మెట, అంక్షాపూర్, నాగరాజుపల్లి గ్రామాలకు చెందిన ఆయిల్ పామ్ రైతులు పాల్గొన్నారు. ఈ సదస్సుకు క్షేత్ర అధికారి నితీష్ కుమార్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయిల్ ఫెడ్ జిల్లా అధికారి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, ఆయిల్ పామ్ తోటల్లో సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగులో పాటించాల్సిన మెళకువలను రైతులకు వివరించారు. ఎరువులను సరైన సమయంలో, సరైన మోతాదులో వేయడం వల్ల దిగుబడి మెరుగవుతుందని చెప్పారు.అలాగే వేసవి కాలంలో తగిన విధంగా నీటిని అందించాల్సిన అవసరాన్ని వివరించారు. కొత్తగా ఆయిల్ పామ్ సాగు చేయాలనుకునే రైతులు ఆధార్ కార్డు, పట్టా పాస్ పుస్తకం, బ్యాంక్ ఖాతా జిరాక్స్ ప్రతులను క్షేత్ర స్థాయి అధికారికి అందజేయాలని సూచించారు.

## జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లను మంజూరు చేయాలి

*** కలెక్టర్ను సత్కరించిన అక్రిడిషన్ కమిటీ సభ్యులు**



మేడ్చల్, ప్రజాస్ఫూర్తి : జిల్లాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లను మంజూరు చేయాలని అక్రిడిషన్ కమిటీ సభ్యులు కోరారు. గురువారం కలెక్టరేట్ లోని ఆయన ఛాంబర్లో మేడ్చల్ జిల్లా మీడియా కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్ మనో చౌదరిని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఇందుకు స్పందించిన ఆయన జీవో మేరకు తప్పనిసరిగా అర్హులందరికీ అందజేస్తామని తెలిపారు. ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పారదర్శకంగా జర్నలిస్టులను గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అక్రిడిషన్ కమిటీ సభ్యులు మోతె వెంకట్ రెడ్డి, గడ్డమీది బాలరాజు, రామారావు, రవి, , సునీల్, ప్రసాద్, భూపాల్, రాజేష్ రెడ్డి, యూసుఫ్ దీన్, అబిద్ స్వామి, జిల్లా పౌర సంబంధాల అధికారిని స్వర్ణలత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీతో టీపీసీసీ చీఫ్ భేటీ.. రాష్ట్ర రాజకీయాలపై చర్చ

ఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఢిల్లీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను రాహుల్‌కు టీపీసీసీ చీఫ్ వివరించారు. అదేవిధంగా రాష్ట్రంలో తాజా రాజకీయ అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. కాంగ్రెస్ ఆర్గనైజేషన్ కార్యక్రమాలు, డీసీసీ అధ్యక్షుల నియామకాలు, జిల్లా కమిటీలు, మండల కమిటీల నియామకాలను రాహుల్‌కు వివరించారు. తెలంగాణలో కులగణన సమాచారాన్ని ప్రకటించినట్లు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. మహిళా రిజర్వేషన్లలో బీసీ రిజర్వేషన్లను జోడించాలని రాహుల్‌కు విజ్ఞప్తి చేశారు. రాబోయే ఏఐసీసీ జాతీయ ఓబీసీ సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించాలని కోరారు.

## ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి పాలకులు చిత్తశుద్ధితో కృషి చేయాలి

*** టిపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి రాచకొండ ఉపేందర్**




మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన సుందరయ్య విజ్ఞాన కేంద్రం, హైదరాబాదులో నిర్వహించనున్న రాష్ట్ర విద్యా సదస్సును విజయవంతం చేయాలని టిపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి రాచకొండ ఉపేందర్ పిలుపునిచ్చారు. ప్రాథమికోన్నత పాఠశాల బ్రాహ్మణపల్లి లో విద్యాసదస్సుకు సంబంధించిన వాల్ పోస్టర్స్ ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలతో పాటు, అనేక సామాజిక సమస్యల పట్ల అనునిత్యం పోరాటం చేస్తుందన్నారు. కామన్ స్కూల్ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టి అందరికీ ఒకే రకమైన,నాణ్యమైన ఉచిత విద్యను అందించాలని చాలా సంవత్సరాలుగా టిపిటిఎఫ్ ఉద్యమాలు చేస్తుందని వివరించారు. కానీ ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగం పట్ల పూర్తిగా నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయని తెలిపారు. విద్య ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందనే విషయాన్ని గుర్తెరిగి ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్టం చేయడానికి పాలకులు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. ప్రజాస్వామిక విలువల పునాదిగా ఉండాల్సిన విద్యా విధానంపై, కేజీ నుండి పీజీ వరకు ఉచిత, సమాన విద్య తదితర అంశాలపై చర్చించడానికి రాష్ట్ర విద్యా సదస్సును నిర్వహించడం జరుగుతుందని ఈ విద్యా సదస్సులో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధారావత్ భద్రు ఉపాధ్యాయులు పాలకుర్తి మౌనిక, మాడిశెట్టి సూర్య ప్రకాష్, గొట్టిముక్కల పవన్ రాజ్, కుప్పం సూర్యతేజ, బానోత్ శంకర్, గిద్దె శృతి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రధానోపాధ్యాయుడి ఉద్యోగ విరమణ అభినందన సభ



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ జిల్లాలోని జడ్పీహెచ్ఎస్ జమాండ్లపల్లి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సమ్మెట వెంకటేశ్వర్లు పదవీ విరమణ సందర్భంగా వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులు,విద్యార్థులు,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ, అతిథులు పాల్గొన్నారు. సమ్మెట వెంకటేశ్వర్లు తమ సేవా కాలంలో పాఠశాల అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు.వారి నాయకత్వంలో పాఠశాల విద్యా ప్రమాణాలు పెరిగి,విద్యార్థులు అనేక రంగాల్లో ప్రతిభ కనబరిచారు. క్రమశిక్షణ, నిబద్ధత, సేవాభావంతో వారు అందరికీ ఆదర్శంగా నిలిచారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు జి. వెంకటేశ్వర్లు, ఎస్. సైదులు రెడ్డి, బి. శ్యామ్ ప్రసాద్, కె. శ్రీ వాణి, ఆర్. చంద్రశేఖర్ తదితరులు తమ అనుభవాలను పంచుకుంటూ, ప్రధానోపాధ్యాయ సేవలను స్మరించుకున్నారు.విద్యార్థులు కూడా ఆయనకు భావోద్వేగపూర్వకంగా వీడ్కోలు పలికారు.చివరిగా,పాఠశాల తరపున ప్రధానోపాధ్యాయ కి కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఆయన భవిష్యత్ జీవితం ఆరోగ్యం, ఆనందంతో నిండాలని శుభాకాంక్షలు తెలిపారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి

*** సమీక్షా సమావేశంలో శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు**



ప్రజాస్ఫూర్తి,కొత్తగూడెం: ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను నిర్దేశించిన గడువులోగా త్వరితగతిన పూర్తి చేయాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అధికారులను ఆదేశించారు. గురువారం కొత్తగూడెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గృహనిర్మాణ శాఖ మండల స్థాయి అధికారులు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ దఫాలుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమకావాల్సిన బిల్లుల విషయంలో ఎదురవుతున్న లోపాలను వెంటనే సరిచేయాలని సూచించారు. ముఖ్యంగా సాంకేతిక సమస్యల కారణంగా బిల్లులు నిలిచిపోకుండా స్థానిక అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. స్థానిక పరిధిలోని సమస్యలను ఇక్కడే పరిష్కరించి, రాష్ట్ర స్థాయిలోని పెండింగ్ అంశాలను సత్వరమే ఉన్నతాధికారులకు నివేదించి పరిష్కరించేలా చూడాలని ఆదేశించారు. ఇండ్ల నిర్మాణ బిల్లుల విషయంలో పేద లబ్ధిదారులను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు అందేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, హౌసింగ్ పిడి రవీంద్రనాథ్, కమిషనర్ సుజాత, ఎంపిడిఓలు, తహసీల్దార్లు, గృహనిర్మాణ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## తపాలాపూర్ ఉన్నత పాఠశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ కార్యక్రమం



ప్రజాస్ఫూర్తి , జన్నారం : జన్నారం మండలం లోని తపాలాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 202526 విద్యా సంవత్సరానికి గాను 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ కార్యక్రమాన్ని గురువారం రోజున ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు దుంపల తిరుపతి మాట్లాడుతూ, గ్రాడ్యుయేషన్ సెర్మనీ సాధారణంగా యూనివర్సిటీల్లో నిర్వహిస్తారని, అలాంటి కార్యక్రమం మన పాఠశాలలో నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదవడానికి ఇది ఇన్స్పిరేషన్‌గా ఉంటుందని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా తమ పాఠశాలలో వినూత్న, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, తల్లిదండ్రులు గమనించి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలల్లో వేలకు వేలు ఖర్చు చేయాల్సిన అవసరం లేదని, నాణ్యమైన విద్యను అందించే ఉపాధ్యాయులు తమ పాఠశాలలో ఉన్నారని తెలిపి ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థులు గ్రాడ్యుయేషన్ పట్టా తీసుకుంటున్నప్పుడు వారి కళ్లల్లో ధైర్యం, పై చదువులు చదవాలనే ఉత్సాహం కనిపించిందని, దీన్ని చూసి తల్లిదండ్రులు ఆనందపడ్డారన్నారు. అనంతరం విద్యార్థులందరికీ ప్రగతి పత్రాలు అందజేసి, వేసవి సెలవుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేందర్, గోపాల్, రామారావు, శ్రీనివాస్, షరిష్మా, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ మొండివైఖరి వల్లే సమ్మె

**: ఎమ్మెల్యే కూనంనేని**



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: ప్రభుత్వ మొండివైఖరి వల్లే ఆర్టీసీ కార్మికులు సమ్మె బాట పట్టాల్సి వచ్చిందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు విమర్శించారు. 21వ తేదీ అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ ఉద్యోగులు చేపట్టిన సమ్మె నేపథ్యంలో, కార్మిక సంఘాల ప్రతినిధులు మరియు ఉద్యోగులు గురువారం కొత్తగూడెంలోని ఆయన నివాసంలో కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. చాలీచాలని వేతనాలతో కాలం వెళ్లదీస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించడం సరికాదని, వారి పొట్టకొట్టే చర్యలను మానుకోవాలని సూచించారు. ఎన్నికల హామీల అమలు కోసం కార్మికులు చేపట్టిన ఈ ఆందోళనకు తమ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. సమ్మె వల్ల ప్రజలకు రవాణా ఇబ్బందులు కలగకముందే ప్రభుత్వం చర్చలు జరపాలని, లేనిపక్షంలో అసెంబ్లీలో కార్మికుల పక్షాన గళం వినిపిస్తామని హెచ్చరించారు. కార్మికుల హక్కుల కోసం క్షేత్రస్థాయిలో కూడా పోరాటం చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. కూనంనేని వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు ఉన్నారు.

## విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

*** ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి చేరేలా సకల సదుపాయాలు**

*** మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. పేదవారి పిల్లలు కూడా ధనికుల పిల్లలతో సమానంగా చదువుకోవాలని ప్రభుత్వం కంకణం కట్టుకుందని, ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థలను ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. విద్య పట్ల ప్రభుత్వం చూపుతున్న నిబద్ధతకు అనేక నిదర్శనాలు ఉన్నాయని వివరించారు. మణుగూరు మండలం లంక మల్లారం గ్రామంలో గురువారం భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని బీటీ రహదారి పనులకు శంకుస్థాపన చేసి, టీటీఆర్‌జేసీ బాలికల డార్మెటరీ హాల్‌ను ప్రారంభించారు. తొలుత రూ.1 కోటి అంచనా వ్యయంతో ప్రధాన బీటీ రహదారి నుండి పాఠశాల వరకు అప్రోచ్ బీటీ రహదారి నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఇటీవలే రూ.2.70 కోట్ల వ్యయంతో బాలికల వసతి గృహాన్ని ప్రారంభించామని పేర్కొన్నారు. పేద కుటుంబాలకు చెందిన పిల్లలు కూడా మంచి ఆహారం తీసుకుంటూ, మెరుగైన విద్యను అభ్యసించాలనే ఆశయంతో ప్రభుత్వం హాస్టళ్లలో ఉన్న బాలబాలికలకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తోందన్నారు. ఇంటి వద్ద తల్లులు చేసే వంటల రుచిని గుర్తు చేసేలా పోషకాహారంతో కూడిన మెనూను అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రతి రోజూ అందించే ఆహారం విషయమై స్పష్టమైన ప్రణాళికతో హాస్టళ్లలో సకల సౌకర్యాలు కల్పిస్తూ విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ ప్రభుత్వం పేద విద్యార్థుల భవిష్యత్తుపై పూర్తి విశ్వాసంతో ఉందని, వారు తమ కాళ్ల మీద నిలబడి దేశాన్ని, ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదగగలరని నమ్ముతున్నామని పేర్కొన్నారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా ఎవరికీ చదువు ఆగిపోకుండా అన్ని వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. వైద్య రంగంలో కూడా పేదవారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. కుటుంబంలో ఎవరికైనా అనారోగ్యం కలిగితే ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేసి, నాణ్యమైన వైద్య సేవలను అందిస్తున్నామని చెప్పారు.ఈ సందర్భంగా పాఠశాలలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో శాతం వంద ఫలితాలు సాధించినందుకు ప్రిన్సిపాల్, సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వ తరపున అభినందించారు. అనంతరం పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం శాసన సభ్యులు తెల్లం వెంకటరావు, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి రాహుల్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, గ్రామ సర్పంచ్ పూనెం రమేష్, పాఠశాల ప్రిన్సిపాల్ రాణి, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# భాజపా సర్కార్ వస్తే.. బెంగాల్‌లోకి ఎవరూ చొరబడలేరు: అమిత్ షా

బాలాగఢ్: పశ్చిమ బెంగాల్‌లో ఈసారి అధికారం భాజపాదేనని కేంద్ర హోంమంత్రి అమిత్ షా (Amit Shah) విశ్వాసం వ్యక్తం చేశారు. తొలి విడత పోలింగ్ ముగుస్తున్న తరుణంలో బెంగాల్‌లో తాము పూర్తి మెజార్టీతో ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్నామని వ్యాఖ్యానించారు. హుగ్లీ జిల్లాలోని బాలాగఢ్‌లో ఏర్పాటు చేసిన రెండో విడత ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. "మే 5న దీదీ ఆట ముగుస్తుంది. భాజపా ప్రభుత్వం పూర్తి మెజార్టీతో ఏర్పాటవుతుంది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ, భద్రతకు చొరబాటుదారులు హాని కలిగిస్తున్నారు. బెంగాల్ యువత ఉద్యోగాలు, పేదల రేషన్‌ను దోపిడీ చేయడంతో పాటు దేశ భద్రతను దెబ్బతీసేందుకు కుట్ర చేస్తున్నారు" అని ఆరోపించారు. "ఏప్రిల్ 29న (రెండో



విడత ఎన్నికల్లో) కమలం గుర్తుపై ఓటేయండి. ఇది మీరు కేవలం ఎవరో ఒకరిని ఎమ్మెల్యేని చేసేందుకో, భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికో కాదు.. చొరబాటుదారుల నుంచి బెంగాల్‌కు విముక్తి కల్పించడానికి. ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక బెంగాల్‌లోకి ఎవరూ చొరబడలేరు. ఇప్పటికే అక్రమ వలసదారులను భాజపా బయటకు పంపిస్తోంది" అని అన్నారు. మరోవైపు, బెంగాల్‌లో జరుగుతున్న తొలి విడత ఎన్నికల్లో భారీగా పోలింగ్ నమోదైంది. మధ్యాహ్నం 3గంటల సమయానికి 78.77శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. మొత్తం 16 జిల్లాల పరిధిలోని 152 నియోజకవర్గాల్లో ఈ రోజు ఉదయం 7గంటలకు పోలింగ్ మొదలైన విషయం తెలిసిందే.

## ట్రంప్ 'నరకం' వ్యాఖ్యలు.. స్పందించిన భారత్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23 : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌ను నరకంతో పోల్చడంపై.. విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ స్పందించారు. "ఆ కథనాలను మేం చూశాం. వాటిని అక్కడితో వదిలేస్తున్నాం" అని మీడియా అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. అమెరికాలో అమల్లో ఉన్న జన్మతః పౌరసత్వ చట్టాన్ని ట్రంప్ ఎప్పటినుంచో వ్యతిరేకిస్తున్నారు. ఈ క్రమంలో అమెరికన్ రేడియో హోస్ట్ మైఖెల్ సావేజ్ షేర్ చేసిన లేఖను రీపోస్టు చేశారు. "ఆసియా దేశాల నుంచి మహిళలు తొమ్మిదో నెలలో అమెరికాకు వచ్చి బిడ్డకు జన్మనిస్తారు.



ఇక్కడ ఉన్న చట్టాలేమో ఆ బిడ్డకు వెంటనే అమెరికా సిటిజన్‌షిప్ ఇస్తాయి. ఆ తర్వాత వారు తమ కుటుంబసభ్యులందరినీ చైనా, భారత్ లేదా మరేదైనా నరకం నుంచి ఇక్కడికి తీసుకొస్తారు" అని ఆ లేఖలో భారత్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారు.

## కేసీఆర్, హరీశ్‌రావు నిర్దోషులని హైకోర్టు ఎక్కడా చెప్పలేదు: ఉత్తమ్

హైదరాబాద్: కాళేశ్వరం అంశంపై ఎలా ముందుకు వెళ్లాలనేదానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంత్రుల సబ్‌కమిటీ వేసుకుని.. చర్చించుకుని ఎలా ముందుకెళ్లాలో నిర్ణయిస్తామని చెప్పారు. మంత్రివర్గ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం వ్యవహారంపై సీబీఐకి లేఖ రాసి 9 నెలలు గడిచినా ఎందుకు ముందుకెళ్లట్లేదో మీరే అర్థం చేసుకోవచ్చన్నారు. తాను, సీఎం రేవంత్ త్వరలో సీబీఐ డైరెక్టర్‌ను కలవబోతున్నట్లు వెల్లడించారు. "కాళేశ్వరం అవకతవకలపై వేసిన కమిషన్ ఏర్పాటు చట్టవిరుద్ధమని కేసీఆర్, హరీశ్‌రావు పిటిషన్ వేశారు. అయితే, కమిషన్ ఏర్పాటు చట్టవిరుద్ధం కాదని హైకోర్టు స్పష్టంగా చెప్పింది. కేసీఆర్, హరీశ్‌రావుల ప్రధాన విజ్ఞప్తిని హైకోర్టు తోసిపుచ్చింది. కమిషన్‌ను చట్టవిరుద్ధం కాదని.. నివేదిక కొనసాగుతుందని హైకోర్టు స్పష్టంగా చెప్పింది. సాంకేతిక అంశాల కారణంగానే కేసీఆర్, హరీశ్‌రావులపై చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. వారిద్దరూ నిర్దోషులని, కాళేశ్వరం అవకతవకలకు బాధ్యులు కారని ఉన్నత న్యాయస్థానం ఎక్కడా చెప్పలేదు. బీఆర్‌ఎస్ నేతలు ఎందుకు సంబరాలు చేసుకుంటున్నారో అర్థం కావడం లేదు. అభిషేక్ సింఘ్వీని కలిసి తదుపరి కార్యాచరణ చేపడతాం" అని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు.

**ఆర్టీసీ కార్మికులతో చర్చలకు సబ్‌కమిటీ..**


ఆర్టీసీ కార్మికులతో శుక్రవారం చర్చలు జరిపేందుకు సబ్‌కమిటీ ఏర్పాటయ్యింది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు ఇందులో సభ్యులుగా ఉన్నారు. ఆర్టీసీ కార్మికుల ఆత్మహత్యాయత్నం ఘటనల గురించి తెలిసి సీఎం రేవంత్‌రెడ్డి చలించిపోయారని, అందుకే.. కేబినెట్ మీటింగ్ మధ్యలోనే మీడియా సమావేశం ఏర్పాటు చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్మికులు క్షణికావేశానికి లోనుకావాల్సిన అవసరం లేదన్నారు. వారి విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ఉందని చెప్పారు. "గత ప్రభుత్వం ఉద్యోగుల



రిటైర్మెంట్ ప్రయోజనాలు రూ.వేల కోట్లు పెండింగ్‌లో పెట్టింది. ఇంకా రూ.6 వేల కోట్ల మొత్తం ప్రయోజనాలు ఇవ్వాల్సి ఉంది. ఈ బెనిఫిట్స్ ఇచ్చేందుకు మంత్రుల వేతనాల్లో సగం కేటాయిస్తున్నాం. బెనిఫిట్స్ పూర్తిగా ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించింది. పీఏసీఎస్ ఛైర్మన్లను రాబోయే రోజుల్లో నామినేటెడ్ పద్ధతిలో భర్తీ చేస్తాం. గచ్చిబౌలి స్టేడియాన్ని అభివృద్ధి చేసేందుకు టాటా సంస్థ అంగీకరించింది. ఈ స్టేడియంలోని 76 ఎకరాలను రూ.700 కోట్లతో అభివృద్ధి చేయనుంది" అని తెలిపారు.

## వాట్సప్ యూనివర్సిటీ' సమాచారం తీసుకోం
## సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: 'శబరిమల ఆలయం సహా ప్రార్థనా స్థలాల్లో మహిళల పట్ల వివక్ష' కేసులో గురువారం మరోసారి విచారణ జరిగింది. ఈ సందర్భంగా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని 9 మంది సభ్యుల విస్తృత రాజ్యాంగ ధర్మాసనం ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ప్రముఖ రచయితలు, మేధావుల అభిప్రాయాలను గౌరవిస్తామని.. వాట్సప్ యూనివర్సిటీ ప్రచారాన్ని



మాత్రం అంగీకరించలేమని పేర్కొంది. "జ్ఞానంతో కూడిన వివరణ ఎక్కడి నుంచి వచ్చినా దానిని స్వాగతించాలి" అని సీనియర్ న్యాయవాది నీరజ్ కిషన్ కౌల్ ఒక కథనాన్ని చూపిస్తూ వాదించారు. "మేం ఆ అభిప్రాయాలను గౌరవిస్తాం కానీ.. వాటిని వ్యక్తిగతమైనవిగానే పరిగణిస్తాం. ఇవన్నీ న్యాయపరమైన నిర్ణయాలపై ఎలాంటి ప్రభావం చూపవు" అని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా జస్టిస్ బీవీ నాగరత్న మాట్లాడుతూ.. వాట్సప్ యూనివర్సిటీ నుంచి వచ్చే సమాచారాన్ని మాత్రం అంగీకరించలేమని చమత్కరించారు.



## చైనీయులకు పర్యాటక వీసాల జారీని
## పునరుద్ధరించిన భారత్

భారత్ చైనా మధ్య దౌత్య సంబంధాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ క్రమంలోనే గత అయిదేళ్లుగా చైనా జాతీయులకు నిలిచిపోయిన పర్యాటక వీసాలను పునరుద్ధరించాలని భారత్ నిర్ణయించింది. ఈమేరకు హోంశాఖ తాజాగా మార్గదర్శకాలను జారీ చేసింది. గల్వాన్ ఘటన తర్వాత చైనా టూరిస్ట్ వీసాలు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. టూరిస్టు వీసాలజారీలో పొరుగుదేశంతో ఉన్న సంబంధాలు సాధారణస్థితికి తీసుకురావడమే ప్రధాన లక్ష్యంగా తెలుస్తోంది. అధికారుల సమాచారం ప్రకారం.. చైనా, హాంకాంగ్ పౌరులకు పర్యాటక వీసాలను జారీ చేయడం కోసం కేంద్ర హోంశాఖ మార్గదర్శకాలను విడుదల చేసింది. దౌత్య సంబంధాలను మెరుగుపరుచుకొనేందుకు గతేడాది నుంచి ఆంక్షల సడలింపు కొనసాగుతోంది. ఈ క్రమంలోనే ఇరుదేశాల ఒప్పందంతో నేరుగా విమానాల రాకపోకలను పునరుద్ధరించారు. సుదీర్ఘకాలంగా నిలిచిపోయిన కైలాస మానససరోవర్ యాత్రను కూడా తిరిగి ప్రారంభించారు.

## 'భారత్ గొప్ప దేశం'.. ట్రంప్ నష్ట నివారణ చర్యలు

దిల్లీ: భారత్‌ను నరక కూపంతో పోల్చి వివాదంలో చిక్కుకున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నష్ట నివారణ చర్యలకు దిగారు. సామాజిక మాధ్యమంలో వచ్చిన పోస్టును రీపోస్ట్ చేయడం ద్వారా వివాదంలో చిక్కుకున్న ఆయన.. 'భారత్ ఎంతో గొప్ప దేశం. నా మిత్రుడు అక్కడ ఉన్నత స్థానంలో ఉన్నారు' అని పేర్కొనడం గమనార్హం. ఈ మేరకు భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయ అధికార ప్రతినిధి ఓ ప్రకటనలో



వెల్లడించారు. అయితే, భారత్ గొప్ప దేశమంటూ ట్రంప్ ఎప్పుడు, ఎక్కడ అన్నదీ మాత్రం పేర్కొనలేదు. అమెరికాలో అమల్లో ఉన్న జన్మతః పౌరసత్వ చట్టాన్ని ట్రంప్ ఎప్పటినుంచో వ్యతిరేకిస్తున్నారు. ఈ క్రమంలో అమెరికన్ రేడియో హోస్ట్ మైఖెల్ సావేజ్ షేర్ చేసిన లేఖను ట్రంప్ రీపోస్టు చేశారు. తన పోస్టులో భారత్, చైనాను నరక కూపాలు అంటూ ప్రస్తావించడం, దానికి మద్దతుగా ట్రంప్ రీ పోస్ట్‌చేయడం వివాదానికి దారితీసింది. ఈ నేపథ్యంలో భారత మీడియా నుంచి ప్రశ్నలు లేవనెత్తడంతో రాయబార కార్యాలయం వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. ఈ వివాదంపై భారత్ విదేశాంగ శాఖ కూడా స్పందించింది. 'ఆ కథనాలను మేం చూశాం. వాటిని అక్కడితో వదిలేస్తున్నాం' అని ఆ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ పేర్కొన్నారు.

## అవి నరకాలు కావు... మానవాళికి మహోన్నత దేశాలు...


హైదరాబాద్/వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ఇరాన్ గట్టి కౌంటర్ ఇచ్చింది. భారత్, చైనా సహా ఇతర దేశాలను నరకాలతో పోలుస్తూ అమెరికన్ రేడియో హోస్ట్ మైఖెల్ సావేజ్ షేర్ చేసిన లేఖను ట్రంప్ రీపోస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే భారత్ నాగరికతకు పుట్టినిల్లు అంటూ హైదరాబాద్‌లోని ఇరాన్ ఎంబసీ పోస్టు పెట్టింది. "ఆసియా దేశాల నుంచి మహిళలు తొమ్మిదో నెలలో అమెరికాకు వచ్చి బిడ్డకు జన్మనిస్తారు. ఇక్కడ ఉన్న చట్టాలేమో ఆ బిడ్డకు వెంటనే అమెరికా సిటిజన్‌షిప్ ఇస్తాయి. ఆ తర్వాత వారు తమ కుటుంబసభ్యులందరినీ చైనా, భారత్ లేదా మరేదైనా నరకం నుంచి ఇక్కడికి తీసుకొస్తారు" అంటూ జన్మతః పౌరసత్వం పై మైఖెల్ షేర్ చేసిన ఒక లేఖను ట్రంప్ రీపోస్టు చేసిన సంగతి



తెలిసిందే. దీనికి ఇరాన్ కౌంటర్ ఇస్తూ.. "భారత్, చైనాలు మహోన్నత నాగరికతలకు పుట్టినిళ్లు. ఇరాన్ నాగరికతను నాశనం చేస్తామని ఒక యుద్ధ నేరస్థుడైన అధ్యక్షుడు చెప్పడమే అసలైన నరకం" అని విమర్శించింది. ఇరాన్ నాగరికత మొత్తం అంతమైపోతుందని గతంలో ట్రంప్ హెచ్చరికలు చేసిన తెలిసిందే. ఆ బెదిరింపులను ఉద్దేశించే తాజా స్పందన వచ్చింది. భారత, చైనా నాగరికతలు ప్రపంచంలోనే పురాతన, సజీవ నాగరికతలు. 4వేల ఏళ్లనాటి చరిత్ర, సంస్కృతి ఈ దేశాల సొంతం. ఈజిప్టు, మెసొపొటేమియా వంటి నాగరికతలు అంతమైనా భారత్, చైనా నాగరికతలు సింధు, హొయాంగ్ హో నది (యల్లో రివర్) ఒడ్డున విస్తరించాయి. ఈ రెండూ వేర్వేరు భౌగోళిక పరిస్థితుల్లో విలసిల్లినా.. ఆసియా చరిత్రపై బలమైన ప్రభావాన్ని చూపించాయి. ఇప్పుడు ఈ రెండు దేశాలు బలమైన ఆర్థిక శక్తులుగా ఎదుగుతున్నాయి. అలాగే ఇరాన్ నాగరికత (పర్షియా) కూడా పురాతనమైనదే. అదే అమెరికా (USA) విషయానికొస్తే.. 1776లో ఏర్పడింది. అంటే దాని చరిత్ర పట్టుమని 250 ఏళ్లే.

## ఆ జలసంధిలో.. ఒక్కచోటే 124 నౌకల శకలాలు

అంతర్జాతీయ సరకు రవాణాలో జలసంధి పాత్ర ఎంత కీలకమో హర్మూజ్ పరిణామాలతో స్పష్టమైంది. అలాంటి మరో కీలక జలసంధికి సంబంధించి ఓ ఆసక్తికర వార్త తాజాగా బయటికొచ్చింది. ఐరోపా, ఆఫ్రికాను వేరుచేసే 'జిబ్రాల్టర్ జలసంధి (Strait of Gibraltar)'లో ఓ చోట 124 నౌకల శకలాలను పురావస్తు శాస్త్రవేత్తలు గుర్తించారు. వీటిల్లో అత్యంత పురాతన ఓడల నుంచి ఆధునిక నౌకల శకలాలు వరకు ఉన్నాయని శాస్త్రవేత్తలు తమ అధ్యయనంలో వెల్లడించారు. స్పెయిన్‌కు చెందిన కొందరు పురావస్తు శాస్త్రవేత్తలు 2020-2023 మధ్య సర్వే చేశారు. నీటి అడుగున ఉన్న పురావస్తు ప్రాంతాలకు వెళ్లారు. ఈ క్రమంలోనే జిబ్రాల్టర్ జలసంధిలోని 29 స్క్వేర్‌మైల్ బే వద్ద 124 నౌకల శకలాలను గుర్తించారు. ఇందులో అతిపురాతన ప్యూనిక్ నాగరికత, రోమన్, మధ్యయుగం నాటి నౌకల శకలాలు కూడా ఉన్నట్లు శాస్త్రవేత్తలు తమ రీసెర్చ్ పేపర్‌లో పేర్కొన్నారు. ఇందులో ఒకటి 5వ శతాబ్దం నాటి నౌక అని గుర్తించారు. అప్పట్లో ఆ నౌకలో స్పెయిన్‌లో ఉత్పత్తి చేసిన చేపల సాస్‌ను రవాణా చేసి ఉండొచ్చని




శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. రెండో ప్రపంచయుద్ధంలో ఇటలీ నౌక ఉపయోగించిన ఓ సబ్‌మెరైన్ శకలాన్ని కూడా ఈ ప్రాంతంలోనే గుర్తించారు. ఈ బృందం నీటి లోపల కేవలం 10 మీటర్ల లోతు వరకే అధ్యయనం చేసిందట. ఈ ప్రాంతం మొత్తం లోతు దాదాపు 400 మీటర్లు ఉంటుందని, ఇంకా లోపలికి వెళ్తే మరిన్ని ఆసక్తికర విషయాలు బయటపడొచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

**ఏంటీ జలసంధి..**

హర్మూజ్ మాదిరిగానే 'జిబ్రాల్టర్' కూడా సన్నని పొడవైన జలసంధి. దాదాపు 36 మైళ్ల పొడవుండే ఈ జలమార్గం అట్లాంటిక్ మహా సముద్రం, మధ్యధరా సముద్రాన్ని కలుపుతుంది. ఈ జలసంధి ఓ ప్రాంతం వద్ద కేవలం 8 మైళ్ల వెడల్పు మాత్రమే ఉంటుంది. అంతర్జాతీయ సరకు రవాణాలో ఇది కూడా ఓ ప్రధాన జలమార్గం. రోజుకు సగటున 300 నౌకలు జిబ్రాల్టర్ మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి.

## డేటా తీగ తెగుతుంది.. ఇరాన్ తాజా హెచ్చరికలు

టెహ్రాన్/దుబాయ్, ఏప్రిల్ 23: అమెరికాఇరాన్ మధ్య కాల్పుల విరమణ కొనసాగుతున్నప్పటికీ.. పశ్చిమాసియాలో యుద్ధం ఎప్పుడు ఏ రూపంలోకి మారుతుందో తెలియని ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సీజ్‌ఫైర్ సమయంలో కూడా అమెరికా హర్మూజ్ ను దిగ్బంధించడంపై ఇరాన్ ఆగ్రహం వ్యక్తంచేస్తోంది. ఈ జలసంధిలో కేబుళ్లు తెగొచ్చని ఐఆర్‌జీసీకి అనుబంధంగా పనిచేసే తస్నిమ్ న్యూస్ ఏజెన్సీ సంకేతాలు ఇచ్చింది. "ప్రమాదాల వల్ల గానీ, ఉద్దేశపూర్వకంగా గానీ వీటికి ఏమైనా నష్టం వాటిల్లితే.. పర్షియన్ గల్ఫ్ అంతటా ఇంటర్నెట్‌కు అంతరాయం కలగవచ్చు" అని ఆ మీడియా కథనం పేర్కొంది. హర్మూజ్ జలసంధి ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకం. అంతేకాదు.. అది డిజిటల్ మౌలిక సదుపాయాలకు కూడా అంతే కీలకమని తస్నిమ్ తన కథనంలో రాసుకొచ్చింది. బ్యాకింగ్, క్లౌడ్ సర్వీస్, కమ్యూనికేషన్లకు ప్రధానమైన ఫాల్కన్, ఏఏఈ1, టీజీఎన్‌గల్ఫ్, ఎస్ఈఏఎంఈడబ్ల్యూఈ వంటి భూగర్భ కేబుల్ వ్యవస్థలు హర్మూజ్ నుంచే వెళ్తున్నాయి. ఈ



కేబుళ్లన్నీ ఇరుకైన మార్గంలో కుప్పపడినట్టుగా ఉండటం వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే నష్టతీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఇరాన్ కంటే యూఏఈ, ఖతార్, బహ్రెయిన్, కువైట్, సౌదీ అరేబియా పైనే ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుందని ఆ కథనం పేర్కొంది. అయితే ఇవన్నీ నోటిమాట బెదిరింపులేమీ కాదు. ప్రాంతీయ ఘర్షణల కారణంగా 2024, 2025లో ఎర్రసముద్రంలోని పలు భూగర్భ కేబుళ్లు దెబ్బతిన్నాయి. ఆ ప్రాంతానికి వెళ్లడానికి ప్రవేశం పరిమితంగా ఉండటంతో వాటిని మరమ్మతు చేయడానికి అప్పట్లో కొన్ని నెలల సమయం పట్టింది. యుద్ధం తీవ్రరూపం దాలిస్తే హర్మూజ్‌లో ఇరాన్.. ఎర్ర సముద్రం దక్షిణ ముఖద్వారం బాబ్ అల్ మందేబ్ జలసంధిలో ఉన్న సముద్రగర్భ కేబుళ్లను హూతీలు టార్గెట్ చేస్తారా..? అన్న అనుమానాలు ఇప్పటికే ఉన్నాయి. ప్రస్తుతం తస్నిమ్ కథనం ప్రకారం.. ఆర్థిక, కమ్యూనికేషన్ ప్రభావం ఎక్కువగా పడే కేబుల్ మార్గాలు, ల్యాండింగ్ స్టేషన్లు, డేటా హబ్‌లను ఇరాన్ హైలైట్ చేస్తోంది. గల్ఫ్ దేశాల్లో ముఖ్యంగా యూఏఈ, బహ్రెయిన్‌లో క్లౌడ్, డేటా సెంటర్ మౌలిక సదుపాయాలు ఒకేచోట కేంద్రీకృతమై ఉన్నాయి. ఇప్పటికే యూఏఈ, బహ్రెయిన్‌లోని అమెజాన్ వెబ్ సర్వీసెస్ అనుసంధానమైన సదుపాయాలను లక్ష్యంగా చేసుకొని ఇరాన్ డ్రోన్ దాడులు జరిపినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ప్రమాద తీవ్రత గురించి బయటకు రానప్పటికీ.. యుద్ధం ఇలాగే కొనసాగితే ఇరాన్ వాటిని మరోసారి టార్గెట్ చేస్తుందా..? అన్న భయాలు నెలకొన్నాయి. కేబుళ్లకు ఏమాత్రం కోత పడినా ఆర్థిక వ్యవస్థలు మందగించవచ్చు. కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లకు అంతరాయం కలగవచ్చు.

# పశ్చిమాసియా సెగ


**వరుసగా రెండో రోజూ కుప్పకూలిన మార్కెట్లు**

**పశ్చిమాసియా ఉద్రిక్తతలు మార్కెట్ల పతనానికి ప్రధాన కారణం**

**సెన్సెక్స్ 852 పాయింట్లు, నిఫ్టీ 205 పాయింట్లు నష్టం**

**ఆటో, ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి**

**బలహీనపడిన రూపాయి, భారీగా పెరిగిన ముడి చమురు ధరలు**



**ముంబై:** పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల కారణంగా భారత ఈక్విటీ మార్కెట్లు వరుసగా రెండో సెషన్‌లోనూ భారీ నష్టాలను చవిచూశాయి. గురువారం ట్రేడింగ్‌లో అమ్మకాల ఒత్తిడి తీవ్రం కావడంతో కీలక సూచీలు దాదాపు ఒక శాతం మేర పతనమయ్యాయి. సెన్సెక్స్ 852 పాయింట్ల (1.09%) నష్టంతో 77,664 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 205 పాయింట్ల (0.84%) నష్టంతో 24,173 వద్ద ముగిసింది.

ట్రేడింగ్ ప్రారంభంలో ఆటో, బ్యాంకింగ్, ఐటీ, రియల్టీ రంగాల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి. టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టాటా మోటార్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ వంటి ప్రధాన షేర్లు నష్టపోయాయి. అయితే, దీనికి భిన్నంగా ఫార్మా, హెల్త్‌కేర్ రంగాల సూచీలు 2 శాతం వరకు లాభపడి మదుపరులకు కొంత ఊరటనిచ్చాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు సైతం నష్టాల్లోనే ముగియడం మార్కెట్‌లో బలహీనతకు సంకేతంగా నిలిచింది. హర్మూజ్ జలసంధి వద్ద ఉద్రిక్త పరిస్థితులు, ఇరాన్ కాల్పుల విరమణ చర్చల్లో అనిశ్చితి వంటి అంశాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయని విశ్లేషకులు చెబుతున్నారు. దీనికి తోడు, ముడి చమురు ధరలు పెరగడం, రూపాయి మారకం విలువ బలహీనపడటం కూడా ప్రతికూలంగా మారింది. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర సుమారు 4 శాతం పెరిగి 105.86 డాలర్లకు చేరింది.

టెక్నికల్‌గా నిఫ్టీకి 24,300 - 24,400 స్థాయి వద్ద తీవ్ర నిరోధం ఎదురవుతోందని, 24,100 - 24,000 స్థాయి కీలక మద్దతుగా ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ మద్దతు స్థాయిని కోల్పోతే నిఫ్టీ 23,800 స్థాయికి పడిపోయే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపు వుండదు..

**కేంద్రం కీలక ప్రకటన**

**ఎన్నికల తర్వాత పెట్రోల్, డీజిల్ ధరల పెంపు లేదన్న కేంద్రం**

**ధరల పెంపు వార్తలు అవాస్తవం, దురుద్దేశపూర్వకమని వెల్లడి**

**గడిచిన నాలుగేళ్లుగా ధరలు పెంచని ఏకైక దేశం భారతేనని స్పష్టీకరణ**

**అంతర్జాతీయంగా చమురు ధరలు పెరుగుతున్నా భారత్‌లో స్థిరంగానే రేట్లు**




**న్యూఢిల్లీ:** పశ్చిమ బెంగాల్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల తర్వాత దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయంటూ వస్తున్న మీడియా కథనాలపై కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ స్పందించింది. ఈ వార్తలను 'దురుద్దేశపూర్వకమైనవి, తప్పుదోవ పట్టించేవి'గా అభివర్ణిస్తూ కొట్టిపారేసింది. ధరల పెంపునకు సంబంధించి ప్రభుత్వ పరిశీలనలో ఎలాంటి ప్రతిపాదన లేదని 'ఎక్స్' వేదికగా స్పష్టం చేసింది.

ప్రజలలో అనవసర భయాందోళనలు సృష్టించేందుకే ఇలాంటి వార్తలను ప్రచారం చేస్తున్నారని మంత్రిత్వ శాఖ పేర్కొంది. "గత నాలుగేళ్లుగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరగని ఏకైక దేశం భారత్. అంతర్జాతీయంగా ధరలు భారీగా పెరిగినప్పటికీ, ఆ ప్రభావం ప్రజలపై పడకుండా ప్రభుత్వం, ప్రభుత్వ రంగ చమురు సంస్థలు నిరంతరం చర్యలు తీసుకున్నాయి" అని వివరించింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరిగి, అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగినప్పటికీ భారత్‌లో ధరలు స్థిరంగానే ఉన్నాయని గుర్తుచేసింది.

దేశంలో సాధారణంగానే ఎల్పీజీ సిలిండర్ల సరఫరా

ఇదే సమయంలో దేశంలో వంటగ్యాస్ (ఎల్పీజీ) సరఫరా సాధారణంగా ఉందని, ఎక్కడా కొరత లేదని పెట్రోలియం శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ తెలిపారు. మరోవైపు అమెరికా-ఇరాన్ శాంతి చర్చలు నిలిచిపోవడంతో హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 103 డాలర్లు దాటగా, డబ్ల్యూటీఐ క్రూడ్ ఆయిల్ ధర 94 డాలర్లకు పైగా ట్రేడ్ అవుతోంది.

## భారత్ సమయం ఆసన్నమైంది: నీతా అంబానీ




**న్యూయార్క్:** భారత్ సమయం అసన్నమైందని రిలయన్స్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ నీతా అంబానీ అన్నారు. న్యూయార్క్‌లో టైమ్ మ్యాగజైన్ నిర్వహించిన టైమ్ 100 సమిట్‌లో పాల్గొన్న సందర్భంగా ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. టైమ్ మ్యాగజైన్ సీఈఓ జెస్సికా సిబ్లీతో జరిగిన ఇంటర్వ్యూలో నాయకత్వం అంశంపై నీతా మాట్లాడుతూ.. ప్రపంచానికి హార్డ్‌పవర్ అక్కర్లేదని, అది సాఫ్ట్ పవర్‌ను కోరుకుంటోందన్నారు. ఆ సాఫ్ట్ పవర్‌కు భారత్ ప్రతినిధిగా ఉందని పేర్కొన్నారు. పూర్తి ఇంటర్వ్యూ త్వరలో ప్రసారం కానుంది. ఈ లీడర్ షిప్ సమ్మిట్‌కు భారత సంప్రదాయ దుస్తుల్లో నీతా అంబానీ హాజరయ్యారు. భారత కళా వైభవాన్ని చాటి చెప్పేలా 'జమ్దానీ' చీరను ధరించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత బీరేన్ కుమార్ బాసక్ రెండేళ్లు కష్టపడి దీన్ని రూపొందించారు.

# ముంబై ధమాల్...

**సంజూ సెంచరీ, అకీల్ స్పిన్ మ్యాజిక్‌తో సీఎస్కే సూపర్ విక్టరీ**

**ముంబై ఇండియన్స్‌పై చెన్నై సూపర్‌కింగ్స్ ఘన విజయం**

**అజేయ సెంచరీతో చెలరేగిన సంజు శాంసన్**

**4 వికెట్లతో ముంబై బ్యాటింగ్‌ను కుప్పకూల్చిన అకీల్ హోసేన్**

**103 పరుగుల భారీ తేడాతో గెలిచిన సీఎస్కే**

**పేలవ ప్రదర్శనతో చేతులెత్తేసిన ముంబై బ్యాటర్లు**




**ముంబై:** ఐపీఎల్ 2026 సీజన్‌లో చెన్నై సూపర్‌కింగ్స్ అద్భుత విజయం నమోదు చేసింది. ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో చెన్నై 103 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. సంజు శాంసన్ (101లి) అద్భుత శతకంతో కదంతొక్కగా, బౌలింగ్‌లో అకీల్ హోసేన్ (4/17) మాయ చేయడంతో చెన్నై సునాయాసంగా గెలుపొందింది.



208 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్‌కు ఆదిలోనే గట్టి షాక్ తగిలింది. 11 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయింది. స్పిన్నర్ అకీల్ హోసేన్ ధాటికి ముంబై బ్యాటింగ్ లైనప్ పేకమేడలా కూలిపోయింది. సూర్యకుమార్ యాదవ్ (36), తిలక్ వర్మ (37) కాసేపు పోరాడినా, వీరిద్దరూ ఔటయ్యాక మిగతా బ్యాటర్లు చేతులెత్తేశారు. దీంతో ముంబై 19 ఓవర్లలో 104 పరుగులకే ఆలౌట్ అయి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. చెన్నై బౌలర్లలో అకీల్ హోసేన్ 4 వికెట్లతో ముంబై పతనాన్ని శాసించగా, నూర్ అహ్మద్ రెండు వికెట్లు తీశాడు.

అంతకుముందు, ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ముంబై ఇండియన్స్ ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్‌కు దిగిన చెన్నై సూపర్‌కింగ్స్, నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 207 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్‌గా బరిలోకి దిగిన సంజు శాంసన్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 54 బంతుల్లో 10 ఫోర్లు, 6 సిక్సర్లతో 101 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అతనికి రుతురాజ్ గైక్వాడ్ (22), డెవాల్డ్ బ్రెవిస్ (21) నుంచి కొంత సహకారం లభించింది. ముంబై బౌలర్లలో గజన్‌ఫర్ రెండు వికెట్లు పడగొట్టాడు.

## ఐపీఎల్‌లో ఆడేందుకు మిచెల్ స్టార్క్ వచ్చేస్తున్నాడు..

**సిడ్నీ:** ఐపీఎల్‌లో ఆడేందుకు ఆస్ట్రేలియా మేటి బౌలర్ మిచెల్ స్టార్క్‌కు ఆ దేశ క్రికెటర్ బోర్డు క్లియరెన్స్ ఇచ్చింది. ఇక ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుతో అతను త్వరలో కలవబోతున్నాడు. మే ఒకటో తేదీన రాజస్థాన్ రాయల్స్‌తో జరగనున్న మ్యాచ్‌లో.. స్పీడ్‌స్టర్ మిచెల్ స్టార్క్ ఆడే అవకాశాలు ఉన్నాయి. మోచేయి, భుజం నొప్పి కారణంగా జనవరి నుంచి స్టార్క్ క్రికెట్‌కు దూరంగా ఉన్నాడు. ఇంగ్లండ్‌తో జరిగిన యాషెస్ సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసి ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డును గెలుచుకున్న విషయం తెలిసిందే. స్టార్క్ మళ్లీ తన పంజా విసరనున్నాడని, 2026 ఐపీఎల్ సీజన్‌లో అతను ఆర్ఆర్‌తో జరిగే మ్యాచ్‌లో ఆడే ఛాన్సు ఉన్నట్లు క్రికెట్ ఆస్ట్రేలియా వెల్లడించింది.

ఐపీఎల్‌లో ప్రారంభ మ్యాచ్‌లకు విదేశీ ఆటగాళ్లు కొందరు దూరం కావడం వివాదాస్పదమైంది. అయితే తనకు గాయమైనట్లు స్టార్క్ ఇటీవల తన ఇన్‌స్టాలో పేర్కొన్నాడు. గత ఏడాది ఐపీఎల్‌లో ఢిల్లీ తరపున స్టార్క్ 11 మ్యాచ్‌లు ఆడి 14 వికెట్లు తీసుకున్నాడు. ఇప్పటి వరకు ఢిల్లీ ఈ సీజన్‌లో పాయింట్ల పట్టికలో అయిదో స్థానంలో ఉన్నది. మూడు ఓటములు, మూడు గెలుపులు ఉన్నాయి. ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమ్మిన్స్ కూడా ఐపీఎల్‌లో ఆడనున్నాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు అతను త్వరలో తొలి మ్యాచ్ ఆడే ఛాన్సు ఉన్నది.




## మ్యాచ్‌కు ముందు కార్టూన్లు చూస్తా

**వైభవ్ సూర్యవంశీ**

**ప్రతి మ్యాచ్‌కు ముందు కార్టూన్లు చూస్తానని చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచిన వైభవ్**

**సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న యువ సంచలనం నిజాయతీ వ్యాఖ్యలు**

**వేగవంతమైన 500 పరుగుల ఘనతలో మ్యాక్స్‌వెల్ ను అధిగమించిన సూర్యవంశీ**



**రాజస్థాన్:** రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్‌లో సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నాడు. నిన్న లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అతను మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో కేవలం 8 పరుగులే చేసినప్పటికీ, ఐపీఎల్ చరిత్రలో 500 పరుగులు పూర్తి చేసిన అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు.

అంతేగాక ఎదుర్కొన్న బంతుల పరంగా వేగంగా ఈ మైలురాయిని చేరుకుని, ఆస్ట్రేలియా స్టార్ ఆటగాడు గ్లెన్ మ్యాక్స్‌వెల్ పేరిట ఉన్న రికార్డును కూడా వైభవ్ బద్దలుకొట్టాడు. ఈ ఘనత సాధించిన తర్వాత అతను పంచుకున్న విషయాలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

మ్యాచ్ అనంతరం మాట్లాడుతూ... "నా బుర్రలో పెద్దగా ఏమీ ఆలోచించను. ఇప్పటికీ ప్రతి మ్యాచ్‌కు ముందు కార్టూన్లు చూస్తాను. అది నాకు అలవాటు. అయితే, ఆటపైనే పూర్తి ఫోకస్ ఉంటుంది" అని నవ్వుతూ చెప్పాడు. చిన్న వయసులోనే స్టార్‌డమ్ వచ్చినా, తనలోని చిన్నపిల్లల అలవాటును నిజాయతీగా చెప్పడంతో నెటిజన్లు అతనిపై ప్రశంసలు కురిపిస్తున్నారు.

"తర్వాతి మ్యాచ్‌లో కచ్చితంగా బాగా ఆడతాను. ఈ విజయంతో రెండు పాయింట్లు సాధించాం. ప్లేఆఫ్స్ దిశగా ముందుకు వెళ్తాం" అని వైభవ్ ధీమా వ్యక్తం చేశాడు.

# రోహిత్ నన్ను క్షమించు..

**అందుకే వరల్డ్‌కప్ జట్టులోకి తీసుకోలే.!**

**న్యూఢిల్లీ:** భారత కెప్టెన్‌గా రోహిత్ శర్మ వన్డే ప్రపంచకప్ అందని ద్రాక్షలా మిగిలింది. మూడేళ్ల క్రితం జట్టును ఫైనల్ చేర్చినా కప్ అందించలేకపోయాడు. అయితే.. 2011లోనే హిట్‌మ్యాన్‌కు వరల్డ్ కప్ విజేతగా నిలిచే అవకాశం వచ్చింది. కానీ, ఒకే ఒక కారణంతో అతడికి అవకాశం చేజారిందని మాజీ సెలెక్టర్ కృష్ణమాచారి శ్రీకాంత్ అంటున్నాడు. 2011లో అతడు సూపర్ ఫామ్‌లో ఉన్నప్పటికీ వన్డే ప్రపంచకప్ స్క్వాడ్‌కు ఎంపిక చేయనందుకు తనను క్షమించాలని రోహిత్‌ను శ్రీకాంత్ అడిగాడు. తాజాగా ది వీక్ అనే పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో అప్పుడు రోహిత్‌ను పక్కన పెట్టేయడానికి గల కారణం వెల్లడించాడు.

తన కెప్టెన్సీలో భారత్‌కు టీ20 ప్రపంచకప్, ఛాంపియన్స్ ట్రోఫీ కట్టబెట్టిన రోహిత్ శర్మ వన్డే ప్రపంచకప్ మాత్రం ముద్దాడలేదు. అయితే.. మనోడికి 2011లో స్వదేశంలో జరిగిన వన్డే ప్రపంచకప్‌లో చోటు దక్కకపోవడమే అందుకు కారణం. అవును.. ఆ ఏడాది మంచి ఫామ్‌లో ఉన్న రోహిత్‌ను సెలెక్టర్లు మెగా టోర్నీకి తీసుకోలేదు. అందుకు బలమైన కారణమే ఉందంటున్నాడు అప్పటి సెలెక్టర్ కృష్ణమాచారి శ్రీకాంత్.

'రోహిత్ 2011 వన్డే ప్రపంచకప్ ఆడలేపోయాడు. రోహిత్‌ను ఎంపిక చేయనందుకు నేను చాలా బాధ పడ్డాను. ఇదే విషయం 2020లో అతడితో చెప్పి నన్ను క్షమించాలని






అడిగాను. అయితే.. ఉద్దేశపూర్వకంగా రోహిత్‌ను 2011 ప్రపంచకప్‌లో పక్కన పెట్టలేదు. అప్పుడు జట్టులో ఎక్కువ మంది ఆల్‌రౌండర్లు ఉండాలనుకున్నాం. అందుకే అతడికి అవకాశం దక్కలేదు' అని శ్రీకాంత్ వెల్లడించాడు.

ఎంఎస్ ధోనీ సారథ్యంలోని భారత జట్టు 2011లో స్వదేశంలో జరిగిన వన్డే ప్రపంచకప్‌ను కొల్లగొట్టింది. ఈ మెగా టోర్నీకి ముందు రోహిత్ 1,200 రన్స్‌తో రేసులో నిలిచాడు. కానీ, రోహిత్ పేరు లేకపోవడానికి కారణం ఆల్‌రౌండర్లకు ప్రాధాన్యం ఇవ్వడమేనని శ్రీకాంత్ తెలిపాడు.

'1983 వరల్డ్ కప్ స్క్వాడ్ మాదిరిగా ఆల్‌రౌండర్లతో నిండిన స్క్వాడ్ కావాలని మేనేజ్‌మెంట్ నిర్ణయించింది. కాబట్టి మేము అదే వ్యూహాన్ని అనసురించాం. మా నమ్మకం నిజమైంది. ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచిన యువరాజ్ బ్యాటుతో, బంతితో మెరిశాడు. సెహ్వాగ్, సచిన్, రైనా కొన్ని ఓవర్లు వేశారు. యూసుఫ్ పఠాన్ సైతం బౌలింగ్ చేశాడు. అందుకే.. రోహిత్‌ను పక్కన పెట్టాల్సి వచ్చింది' అని శ్రీకాంత్ వివరించాడు. భారత్‌కు తొలి వరల్డ్‌కప్ అందించిన కపిల్ డెవిల్స్ బృందంలోని రోజర్ బిన్నీ, కపిల్, శ్రీకాంత్, సయ్యద్ కిర్మాణీ, సునీల్ గవాస్కర్ సైతం బౌలింగ్ చేసిన విషయాన్ని శ్రీకాంత్ ఈ సందర్భంగా పంచుకున్నాడు.

MOVIE TIME

## 'డార్లింగ్' రీ-రిలీజ్‌తో బాక్సాఫీస్‌కు ఊపిరి...

### మరోసారి ప్రూవ్ అయిన ప్రభాస్ స్టామినా !



**టాకీస్:** టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద గత కొన్నాళ్లుగా నెలకొన్న సైలెన్స్‌ను రెబెల్ స్టార్ ప్రభాస్ మరోసారి చెరిపేస్తున్నారు. భారీ సినిమాల హవాతో థియేటర్లు వెలవెలబోతున్న సమయంలో, ఇటీవల వచ్చిన చిన్న సినిమాలు కొంత ఊరటనిచ్చినా... పూర్తి స్థాయిలో ఊపు మాత్రం రాలేదు. ఈ క్రమంలో అడివి శేష్ నటించిన 'డెకాయిట్' చిత్రం మంచి ప్లానింగ్, ప్రమోషన్లతో బ్రేక్ ఈవెన్ సాధించి థియేటర్లకు కొంత ఊపిరి పోసింది. అయితే ఆ సినిమా రన్ ముగిసే సరికి మళ్లీ డల్ పరిస్థితి నెలకొంటుందనుకున్న సమయంలో... 'డార్లింగ్' రీ-రిలీజ్ రూపంలో బాక్సాఫీస్‌కు కొత్త జోష్ వచ్చింది. ప్రభాస్ కెరీర్‌లో క్లాసిక్‌గా నిలిచిన డార్లింగ్ సినిమా రీ-రిలీజ్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది. కేవలం అడ్వాన్స్ బుకింగ్స్ ద్వారానే రూ.3 కోట్లకు పైగా వసూళ్లు రావడం విశేషం. ఇది ప్రభాస్ క్రేజ్‌కు నిదర్శనంగా ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ప్రధాన నగరాల్లో థియేటర్లు హౌస్ ఫుల్ బోర్డులతో కళకళలాడుతున్నాయి. అభిమానులే కాకుండా సాధారణ ప్రేక్షకులు కూడా వింటేజ్ ప్రభాస్‌ను మళ్లీ బిగ్ స్క్రీన్‌పై చూడటానికి ఆసక్తి చూపిస్తున్నారు.

## నవ్వుల జెట్ స్పీడ్‌తో 'జెట్లీ' ట్రైలర్..

### హీరోగా సత్య మరో కామెడీ మ్యాజిక్



**టాకీస్:** కమెడియన్ సత్య హీరోగా నటిస్తున్న సరికొత్త చిత్రం 'జెట్లీ'. రితేష్ రానా దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా ట్రైలర్ నిన్న గ్రాండ్‌గా విడుదలైంది. పూర్తి స్థాయి కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ చిత్రం మే 1న థియేటర్లలోకి రానుంది.

టాలీవుడ్‌లో తనదైన టైమింగ్‌తో నవ్వులు పూయించే కమెడియన్ సత్య హీరోగా నటించిన సినిమా 'జెట్లీ'. ఇప్పటికే విడుదలైన టీజర్, పోస్టర్స్ సినిమాపై మంచి అంచనాలు పెంచగా, తాజాగా విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులను కడుపుబ్బ నవ్విస్తోంది. మిస్ యూనివర్స్ ఇండియా-2024 రియా సింఘా ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించడం విశేషం. ఈ చిత్రంలో వెన్నెల కిశోర్, వైవా హర్ష, అజయ్ ప్రధాన పాత్రల్లో నటించగా.. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై నిర్మితమైన ఈ సినిమాకు కాల భైరవ సంగీతాన్ని అందించారు.




# రాకా మూవీలో దీపికదే కీ రోల్

### ఆమె నటించందన్న వార్తలపై టీమ్ స్పందన

**టాకీస్:** అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'రాకా'. భారీస్థాయిలో రూపొందుతోన్న ఈ సినిమాలో బన్నీకి జోడీగా బాలీవుడ్ నటి దీపికా పదుకొణె నటిస్తున్నారు. ఇటీవల ఆమె రెండోసారి తల్లి కానున్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో ఈ సినిమాపై రూమర్స్ మొదలయ్యాయి. షూటింగ్ ఆలస్యం అవుతుందని.. దీపిక స్థానంలో మరో నటిని తీసుకోనున్నారని వార్తలు వచ్చాయి. తాజాగా వాటిని 'రాకా' టీమ్ ఖండించింది. సినిమాలో దీపిక పాత్ర నిడివి తగ్గించారనే ప్రచారాన్ని కూడా కొట్టేసింది. సినిమాలో ఆమె పాత్ర కీలకమైనదని షూటింగ్ కూడా అనుకున్న షెడ్యూల్స్ ప్రకారమే సాగుతోందని స్పష్టం చేసింది. రూమర్స్‌ను షేర్ చేయొద్దని విజ్ఞప్తి చేసింది. సన్ పిక్చర్స్ నిర్మిస్తోన్న ఈ ఫాంటసీ ఎంటర్‌టైనర్‌లో దీపిక కొన్ని క్రేజీ యాక్షన్ సన్నివేశాల్లోనూ నటించనున్నట్లు తెలుస్తోంది. అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ ఆమె ఈ సీక్వెన్స్ చేస్తున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో ఆమెతో పాటు మరికొందరు హీరోయిన్‌లు కూడా నటించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. రష్మిక, జాన్వీకపూర్, మృణాల్ ఠాకూర్ పేర్లు కూడా వినిపిస్తున్నప్పటికీ, అధికారికంగా మాత్రం ఇంకా చిత్రబృందం వెల్లడించలేదు. ఇందులో ప్రధాన పాత్రల్లో ఎవరు అతిథి పాత్రల్లో ఎవరనే విషయంపై స్పష్టత రావడానికి మరింత సమయం పట్టే అవకాశాలు ఉన్నాయి. వచ్చే ఏడాది ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాలోని లుక్ కోసం అల్లు అర్జున్ రోజూ 3, 4 గంటలు సమయం వెచ్చిస్తున్నారని సినీవర్గాలు చెప్పాయి.

## వరుస ఫ్లాప్‌లతో శ్రీలీల డిసప్పాయింట్

### హిట్‌లు లేకపోవడంతో కెరీర్‌లో ఒడిదుడుకులు




**టాకీస్:** కన్నడ సినిమాలతో కెరీర్ ప్రారంభించి, టాలీవుడ్‌లో తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన శ్రీలీల ప్రస్తుతం తన కెరీర్‌లో కీలక దశను ఎదుర్కొంటోంది. ప్రారంభంలో వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని టాప్ హీరోయిన్ రేసులోకి వచ్చిన ఆమె ఇప్పుడు మాత్రం వరుస ఫలితాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు కనిపిస్తోంది. దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు దర్శకత్వంలో వచ్చిన 'పెళ్లి సందడి' సినిమాతో శ్రీలీల టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోయినా? ఆమెకు మాత్రం మంచి గుర్తింపు వచ్చింది. మొదటి సినిమా ఎ÷-లాప్ అయినా కూడా, ఇండస్ట్రీలో ఆమెకు వరుస అవకాశాలు రావడం విశేషం. రవితేజ సరసన నటించిన 'ధమాకా' సినిమా బ్లాక్‌బస్టర్ కావడంతో శ్రీలీల కెరీర్ ఒక్కసారిగా టర్న్ అయింది. ఆ విజయంతో ఆమె టాలీవుడ్‌లో టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. వరుసగా అరడజను సినిమాలు ఆమె చేతిలో పడగా, కొన్నింటి ఫలితాలు నిరాశపరిచాయి. గత కొన్ని సంవత్సరాలుగా శ్రీలీల వరుస సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ, పెద్ద హిట్ మాత్రం ఆమెకు దక్కలేదు. 'పుష్ప 2'లో చేసిన ప్రత్యేక డాన్స్ నంబర్‌తో ఇతర భాషల ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన ఆమెకు తమిళ, హిందీ ఇండస్ట్రీల్లో అవకాశాలు కూడా వచ్చాయి. తమిళంలో చేసిన 'పరాశక్తి' సినిమా బాక్సాఫీస్ వద్ద విఫలమైంది. దీంతో అక్కడ ఆమెకు ఆశించిన గుర్తింపు రాలేదు. ఇక హిందీలో అనురాగ్ బసు దర్శకత్వంలో చేస్తున్న సినిమా ఆలస్యం అవుతుండటం కూడా ఆందోళన కలిగిస్తోంది. ఆ ప్రాజెక్ట్ ఎప్పుడు పూర్తవుతుందో స్పష్టత లేకపోవడం గమనార్హం. ఇటీవల వచ్చిన 'ఉస్తాద్ భగత్ సింగ్'లో

పవన్ కళ్యాణ్ సరసన నటించినా? సినిమాలో ఆమె పాత్రకు పెద్దగా గుర్తింపు రాలేదు. అదే సమయంలో గత ఏడాది వచ్చిన సినిమాలు కూడా కమర్షియల్‌గా పెద్ద విజయాలను అందుకోలేకపోయాయి. ప్రస్తుతం తెలుగులో పెద్దగా ప్రాజెక్టులు లేకపోవడంతో, శ్రీలీల తన భవిష్యత్తును బాలీవుడ్ సినిమాపైనే ఆధారపెట్టినట్టు కనిపిస్తోంది. ఇదిలా ఉండగా ధనుష్ హీరోగా తెరకెక్కుతున్న ఓ సినిమాలో ఆమెకు అవకాశం వచ్చిందనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై ఇంకా అధికారిక ప్రకటన లేదు. సినీ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఈ సంవత్సరం శ్రీలీల కెరీర్‌కు అత్యంత కీలకం. కనీసం ఒకటి రెండు హిట్స్ సాధిస్తేనే ఆమె మళ్లీ టాప్ రేసులోకి రావచ్చని అంటున్నారు.

## రామాయణంలో రావణ, కుబేర యుద్ధం

### భారీ స్థాయిలో చిత్రీకరిస్తున్న దర్శకుడు


**టాకీస్:** బాలీవుడ్ దర్శకుడు నితీష్ తివారీ దర్శకత్వంలో రణబీర్ కపూర్ హీరోగా రూపుదిద్దుకుంటున్న అత్యంత భారీ బ్జడెట్ చిత్రం 'రామాయణం' గురించి ఒక సంచలన వార్త ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. సాధారణంగా రామాయణం కథ అనగానే శ్రీరాముడి బాల్యం లేదా జననంతో మొదలవుతుందని మనందరికీ తెలుసు, కానీ ఈ చిత్రంలో దర్శకుడు నితీష్ తివారీ సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలుస్తుంది. ఈ సినిమాలో రావణుడిగా నటిస్తున్న కన్నడ సూపర్ స్టార్ యష్ పవర్‌ఫుల్ ఎంట్రీతో, రావణ-కుబేర యుద్ధంతో ప్రారంభం కాబోతుందని తెలుస్తుంది. తన సోదరుడైన కుబేరుడిపై దాడి చేసి, స్వర్ణ లంకను మరియు పుష్పక విమానాన్ని రావణుడు స్వాధీనం చేసుకునే ఘట్టాన్ని అత్యంత భారీ స్థాయిలో వెండితెరపై చూపించబోతున్నట్లు సమాచారం. భారతీయ సినీ చరిత్రలోనే మునుపెన్నడూ లేని విధంగా సుమారు 4,000 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మితమవుతున్న ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. ఇందులో రాముడిగా రణబీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, హనుమంతుడిగా సన్నీ డియోల్ నటిస్తున్నారు. ఇటీవల లాస్ ఏంజిల్స్‌లో జరిగిన ప్రత్యేక స్క్రీనింగ్‌లో ప్రదర్శించిన 20 నిమిషాల ఫుటేజీ చూసిన విశ్లేషకులు, ముఖ్యంగా లంకా నగరం మరియు




రావణుడి యుద్ధ సన్నివేశాల్లోని ఘట్టాలు హాలీవుడ్ స్థాయిని మించి ఉన్నాయని ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. రావణుడి శక్తిని, ప్రతాపాన్ని చూపే ఈ విజువల్ స్పెక్టాకిల్ మొదటి భాగం 2026 దీపావళికి, రెండో భాగం 2027 దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది.

## మెక్సికోలో వారణాసి సీన్స్ ప్రదర్శన

**టాకీస్:** రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతోన్న చిత్రం 'వారణాసి'కోసం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీప్రియులు ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఒక వార్తను ఎస్ఎస్ కార్తికేయ పంచుకున్నారు. మెక్సికోలో జరగనున్న ఓ సినీ వేడుకలో ఈ చిత్రంలోని కొన్ని సన్నివేశాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. మెక్సికో వేదికగా ఏప్రిల్ 24 నుంచి 26 వరకు జరగనున్న కామిక్ కాన్ ఎక్స్‌పీరియన్స్‌లో 'వారణాసి'కి సంబంధించిన ఎక్స్‌క్లూజివ్ కంటెంట్‌ను ప్రదర్శించనున్నారు. ఈ సినిమాకు సంబంధించిన మేకింగ్ వీడియోలు, బిహైండ్ ది సీన్స్‌తో పాటు కొన్ని కీలకమైన సన్నివేశాలతో కూడిన గ్లింప్స్‌ను ప్రేక్షకులకు చూపించనున్నారు. ఈ వేడుకకు కార్తికేయ హాజరు కానుండగా.. రాజమౌళి ప్రత్యేక వీడియో సందేశంతో అక్కడి అభిమానులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో విడుదల కానుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో భారీ షెడ్యూల్ జరుగుతోంది. అంతర్జాతీయస్థాయిలో భారతీయ సినిమా సత్తాను చాటేలా ఈ సినిమాను రాజమౌళి అత్యున్నత సాంకేతిక విలువలతో రూపొందిస్తున్నారు. మహేశ్‌కు జోడీగా ప్రియాంక చోప్రా నటిస్తున్నారు.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.